www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 45 మంగళవారం, జూన్ 30, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## గ్రామీణాభివృద్ధి పథకాల్లో
# తెలంగాణ వెనకబాటు
### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు




# ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్



**అమరావతి,జూన్ 29 :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ముంబయి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయం, రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. మిగతా2లో...



# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

### అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ
### అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

**న్యూఢిల్లీ,జూన్ 29 :** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని మిగతా2లో...

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

### ● రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ ● వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం ● డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం,జూన్ 29 :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మిగతా2లో...



# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

### ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ

**విక్టోరియా,జూన్ 29 :** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. మిగతా2లో...

## కేంద్రం సహకరిస్తేనే
# రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

- పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి
- 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు
- గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతక్క స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,జూన్ 29 :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకు వస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం మిగతా2లో...

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

- రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు



**హైదరాబాద్,జూన్ 29:** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానిం చారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం మిగతా2లో...



# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

### - ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్ 29 :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి ఒక ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి 3 ట్రిలియన్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఒక జాతీయ ఆంగ్ల పత్రిక వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు మిగతా2లో...

## హరీష్ రావుకు మెంటల్
# బ్యాలెన్స్ తప్పింది

### ● ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు- ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి ● ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు ● బిజేపీది ఆశకాదు.. అత్యాశ ● రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమచేస్తాం: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జూన్ 29 :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్య లపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికార మిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. మిగతా2లో...

## జీవితం అంటే వందమీటర్ల
# పరుగుపందెం కాదు

### ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి

- వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ
- వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం
- తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్,జూన్ 29:** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి మిగతా2లో...

# ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 29** ఇప్పటివరకు రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలే కదా! అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు వరంగల్ అభివృద్ధి కోసం ఏం చేశాయో చెప్పాలి అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బిజెపి బూత్ అధ్యక్షుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ ఏదైనా హామీ ఇస్తే..అమలు చేసే గ్యారెంటీ ఉందని, కాంగ్రెస్ లాగా ఆరు గ్యారెంటీలు ఇచ్చి మోసం చేసేది కాదు అని విమర్శించారు. మిగతా2లో...



# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷–డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్–సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలి రావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు–2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్రమంత్రికి వివరించారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు.

# గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనకబాటు

**న్యూఢిల్లీ,జూన్ 29(పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంపై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు.గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐకి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ జాతీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ పేర్కొన్నారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

(మొదటి పేజీ తరువాయి)

గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

5శాతం వాటాను అందిస్తోందని, 2047 నాటికి ఈ వాటాను 10?కి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు ? ఇందులో రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని, వీరికి ఈ ఏడాదే రూ. 21,000 కోట్ల రుణాలు అందించామని, ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల విశ్వాసానికి రెండు ప్రధాన అంశాలు కారణమని శ్రీధర్ బాబు అన్నారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు.

సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని, ఇప్పుడు సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్–టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. 1950–70వ దశకాలలో స్థాపించిన సంస్థల ఆధారంగా అభివృద్ధి చెందిన తెలంగాణ రక్షణ, ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

# ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసింది.. మోడీ సర్కార్ అని కాజీపేటకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ఇచ్చింది బిజెపి సర్కార్ అని తెలియజేశారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీని వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తామని, ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్ ఉంటుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.త్వరలోనే వరంగల్ విమానాశ్రయం పనులు ప్రారంభం అవుతాయని, రూ.19 కోట్లతో హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు సిమెంట్ జాతీయ రహదారి వేశామని అన్నారు. వరంగల్ కు 50 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం మంజూరు చేసిందని, వరంగల్ కు పిఎం మెగా టెక్స్ టైల్స్ పార్క్ మంజూరు చేసి ఇటీవలే ప్రారంభించారని చెప్పారు. సమ్మక్క–సారలమ్మ పేరుతో గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేసుకున్నామని, రూ. వెయ్యి కోట్లతో నిర్మించే గిరిజన వర్సిటీకి ప్రధాని త్వరలోనే శంకుస్థాపన చేస్తారని అన్నారు.

# ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

దీంతో వైద్య పరీక్షల నిమిత్తం ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి పవన్ వెళ్లనున్నారు. పవన్‌కల్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.

# ఫిరోజ్‌గూడ నల్ల పోచమ్మ తల్లి బొడ్రాయి పండుగ తొలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**-- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఆలయ కమిటీ ఆహ్వానంతో హాజరైన ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి**




**బాలానగర్ జూన్ 30 (పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి బొడ్రాయి పండుగ తొలి వార్షికోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, మంగళహారతులు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి దేవాలయ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఐక్యత, పరస్పర సహకారం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మత్స్యకారుల కమిటీ ఉపాధ్యక్షుడు, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ తొలి వార్షికోత్సవం ఫిరోజ్‌గూడ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


# బాలానగర్‌లో మేరు సంఘం ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం


**-- ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు వివరాలు అందించిన మేరు సంఘం నాయకులు**




**బాలానగర్ జూన్ 30 (పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని మేరు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంఘం సభ్యులు సమావేశమై ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిబంధనలు, విధివిధానాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సంఘం నాయకులు, సభ్యులు బాలానగర్ పరిధిలోని మేరు కులస్తుల ఇళ్లకు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, ఓటరు వివ రాల సవరణ, అవసరమైన పత్రాల సమర్పణ, గడువులోపు దరఖాస్తులు చేసు కోవాల్సిన అవసరంపై అవగాహన కల్పిం చారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసు కోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని వివరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)ను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి దాసు, మేరు సంఘం అధ్యక్షులు అన్నం శ్రీనివాస్, సలహాదారుడు రాయి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు అక్కు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, కోశాధికారి చేగూరి నరేందర్, నాపోలు నాగరాజు, కక్కు నాగరాజు తదితర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మేరు సంఘం చేపట్టిన ఈ ఇంటింటి అవగాహన కార్యక్రమం స్థానిక ప్రజల్లో మంచి స్పందన పొందింది. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.


# అనగనగా.... గీ ముంగట ఓ ఊరు ఉన్నది గని, శిమ్మ చీకటిని ఈదుకుంట పోవాలె.





**నేలకొండపల్లి/ఖమ్మం /జూన్29/( పీపుల్స్ న్యూస్ )** సూత్తె పెద్ద ఊరే ఉన్నది, మంది బగ్గనే ఉంటరు, పెద్ద బంగ్లా కట్టింద్రు లోపట మస్తు లైట్ బుగ్గలు పెట్టింద్రు గని, బంగ్లా వాకిట్లో లైట్ బుగ్గలు పెట్టుడు యది మర్సింద్రు, గట్లున్నది గీ నేలకొండపల్లి ఊరి కథ. పెద్దపెద్ద సార్లు, నాయకుల సుత ఉన్నరు, పెద్ద ఆఫీసులు సుత వున్నయ్,ఊరు కు పెద్ద రోడ్డే ఉన్నది, రోడ్డు నడిమిట్ల డివైడర్ గూడ ఏసింద్రు గని, డివైడర్ నడిమిట్ల లైట్ తాంబాలు యేసుడు మరిచిర్రు, లైట్ బుగ్గలు పెట్టుడు మరిచింద్రు, ఊరు పొలిమేర నుంచి ఎల్లి అర్ధ కిలోమీటర్ లైట్ బుగ్గలు లేవు, ప్రయాణికులు పరేషాన్ అవుతుద్రు, రోడ్డుకు చెరువు సుతా ఉన్నది కానీ, కట్టంతా సర్కార్ కంపె, కట్టసుత సాఫ్ జేయుర్రి బాంచన్,రోడ్డు ఏడ మేలుకున్నదో ఏడ సాపుగా వున్నదో ఎరకబడతలేరు, హెచ్చరిక బోర్డులు సుత లేవు, ఎడమవైపు సుత పెద్ద రోడ్డు ఉన్నది గది,చారిత్రక బౌద్ధ స్తూపం పోయే తోవ, గి దిక్కు గుడా లైట్ బుగ్గలు లేవు గీతోవ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డ అయింది, చీకట్ల ప్రయాణికులకు రోడ్డుకు అడ్డంగా బర్రెలు వొత్తయో,కుక్కల వొత్తయో, పాములొత్తయో . ఆనకాల అచ్చింది, అటెంక ఆనసీ ళ్లకు రోడ్డు జారతదో,చెప్పలేం అధికారులు నాయకులు గి బౌద్ధ స్తూపం రోడ్డు దిక్కు, నేలకొండపల్లి ఖమ్మం పోయే తోవ్వకెళ్లి జర, నజర్ పెట్టుర్రి. డివైడర్ మద్దెల లైట్ బుగ్గలు పెట్టుర్రి, హెచ్చరిక బోర్డులు సుత పెట్టుర్రి, అని ప్రజలు కోరుకుంటున్నరు.

# భూవివాదాల్లో జోక్యం చేసుకుంటున్న పోలీసులు





**హైదరాబాద్:** భూవివాదాలను పరిష్కరించే అధికారం పోలీసులకు అస్సలు లేదు. అయినా కొంతమంది సీఐలు, ఎస్సైలు లేని శాంతిభద్రతల సమస్య సృష్టించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. శాంతిభద్రతల సమస్య, ఘర్షణలు జరిగితే పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేయవచ్చనే నిబంధనను అవకాశంగా మార్చుకుని దర్జాగా బేరసారాలు చేస్తున్నారు. తమకు నచ్చిన వర్గానికి, రాజకీయ పలుబడి ఉన్నవారికి, లంచాలు ముట్టజెప్పే వారికి హాయిగా వంతపాడుతున్నారు. సీఐ, ఎస్ఐల వసూళ్లు : లేకపోతే నేరపూరిత అతిక్రమణ, బెదిరింపు, బలప్రయోగం పేరుతో కేసులు పెడతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయి. హైదరాబాద్‌తో పోలిస్తే మల్కాజిగిరి, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్లలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల వసూళ్లపై అత్యధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలో ఔటర్‌ను ఆనుకొని ఉన్న కొన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు డిమాండ్ పెరగడానికి భూ దందాలు ఒక కారణమనే అంశం కూడా ఇక్కడ గమనించవచ్చు.నగరంలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నర్సింహులు ఓ కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.లక్ష డిమాండ్ చేశాడు. అతడి నుంచి రూ.50 వేలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కి జైలుపాలయ్యాడు. సైబరాబాద్ పరిధిలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ ప్రైవేటు ఆసుపత్రి వివాదంలో తలదూర్చినట్టు నిర్ధారణ కావటంతో కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేయడంతో లా అండ్? ఆర్డర్ పోస్టింగ్ పోయింది. హాఫీజ్‌పేట్‌లో ఓ వ్యక్తికి చెందిన భవనాన్ని అద్దెకు తీసుకున్న ఆసుపత్రిని ఖాళీ చేయించడం సీటీ పోలీసు విభాగంలో తీవ్ర చర్చకు దారితీసింది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఒక ఏసీపీ ఇటీవల ఓ ఆర్థిక వివాదంలో పోలీస్‌స్టేషన్ వేదికగా సెటిల్‌మెంట్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై డీసీపీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించారు. ఇదే ఏసీపీ తరచూ సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నట్లు తేలడంతో పోలీస్ కమిషనర్ ఆ ఏసీపీని తీవ్రంగా హెచ్చరించారు. స్టేషన్ బెయిల్ పేరిట వసూళ్లు : భాగ్యనగరంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో స్టేషన్ బెయిల్ పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్న ఎస్సైలపై ఉన్నతాధికారులు ఎక్కువగా ఫోకస్ పెంచారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు. కొందరు ఎస్‌హెచ్‌వోలు కేసు దర్యాప్తును కొలిక్కి తీసుకురాకుండా బాధితులు, నిందితులను పలుమార్లు పోలీస్? స్టేషన్? చుట్టూ తిప్పుతున్నట్టు గుర్తించారు. కొన్ని కేసులను ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో పాత కేసులను కూడా తిరిగి వేగంగా పరిశీలిస్తున్నారు. ఎస్‌వోపీ ఏం చెబుతోందంటే...సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చడం తరచూ వివాదాస్పదంగా మారుతున్న నేపథ్యంలో ప్రస్తుత డీజీపీ సీవీ ఆనంద్ గతంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఎస్‌వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) పకడ్బందీంగా రూపొందించారు. దాన్నే ప్రస్తుతం పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. వివాదాస్పద భూములపై ఇరువర్గాలను పిలిపించి రాజీ చేసే ప్రయత్నాలను అస్సలు చేయకూడదు. ఏ మాత్రం బాధితులను బలవంతం చేయకూడదు. ఒకవేళ ఆక్రమణ, బెదిరింపులు, నకిలీ పేపర్లు సృష్టించినట్లు తెలిస్తే చట్టపరంగా మాత్రమే దర్యాప్తు చేయాలి. ఇరువర్గాల్లో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే బాధితులకు రక్షణ కల్పించడం కోసం ఎదుటివారిపై ఆయా సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయాలి.

# డెప్యుటేషన్‌పై 229 లెక్చరర్ పోస్టులు

**హైదరాబాద్, జూన్ 29॥** తెలంగాణలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. డైట్‌లు, టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలు, ఉన్నత విద్యా అధ్యయన సంస్థలు, ఎస్‌సీఈఆర్‌టీలో ఖాళీగా ఉన్న మొత్తం 229 లెక్చరర్ పోస్టులను డెప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ గ్రాడ్యుయేట్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక సీనియారిటీ, అర్హతలు, అనుభవం ఆధారంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. పూర్తి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి.

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

**- వొడితల ప్రణవ్**



**హుజురాబాద్, జూన్ 29॥** హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) తప్పనిసరిగా బీఎల్‌వోతో కలిసి సవరణ ప్రక్రియలో పాల్గొని, ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్‌కు ఆల్ సంఘాల ఐక్యవేదిక వినతి**



**పెద్దపల్లి, జూన్ 29।** పెద్దపల్లి జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల అమలులో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపిస్తూ ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దళితులపై దాడులు, కుల వివక్ష, దేవాలయ ప్రవేశ నిరాకరణ, భూముల ఆక్రమణ, హత్య కేసులు తదితర ఘటనల్లో నిందితులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగితే జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలతో కలిసి దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**- దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ పంపిణీ**



**మంథని.** తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాల, దర్యాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రాపెల్లి రాజయ్య హాజరై విద్యార్థులకు ఉచిత టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డా. సంతోష్ కుమార్ కేసరి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పుస్తకాలను జాగ్రత్తగా సంరక్షించుకుని విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాత భవనాల తొలగింపుపై పోలీస్ కమిషనర్ సమీక్ష




**వరంగల్, జూన్ 29 ।**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నూతన కమిషనరేట్ భవనం పరిసరాల్లో ఉన్న పాత భవనాల తొలగింపుపై పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పాత భవనాల్లో కొనసాగుతున్న వివిధ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తే, ఆయా విభాగాల కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై అధికారులతో చర్చించారు. కార్యాలయాల తరలింపు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సమీక్షలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు సురేంద్ర, అంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, సతీష్, స్పర్జన్ రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అదనపు డీసీపీ రేవూరి రవి సేవలు అభినందనీయం

**- సీపీ సన్‌ప్రీత్ సింగ్**



**వరంగల్, జూన్ 29 ।** వరంగల్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) రేవూరి రవి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రేవూరి రవి తన సేవా కాలంలో సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి శాఖకు విశేష సేవలు అందించారని అభినందించారు. అనంతరం రేవూరి రవిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసి పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు

# బొమ్మలగుడి శివాలయంలో పరమశివుడి అభిషేక కార్యక్రమం.



**జమ్మికుంటజూన్ 29)**
అన్నపూర్ణ సేవాసమితి వారి ఆధ్వర్యంలో వర్షాకాలం దృశ్య సరైన సమయంలో సరైన వర్షాలు కురవడం లేదని నిర్వహించిన ఆ పరమశివుడి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలోని సరైన సమయానికి అవసరమైన వర్షాలు కురవడం లేదని బొమ్మల గుడి శివాలయంలో మనకు ఏ కష్టం వచ్చినా ముందుగా చెప్పుకునే ఆ పరమశివుడికే అని తెలుపుతూ పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి సన్నిధిలో శివ పరాయణం భక్తులు భజనలతో ఆ పరమశివుడి అభిషేకం చేయడం జరిగిందని ఆ పరమశివుడి దయతో జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రజలు, యావత్ తెలంగాణ ప్రజలు అందరూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, లెంకలపల్లి శరత్,యాంసాని సురేష్, రవీందర్ రెడ్డి, రఘు, చంద్రమౌళి శ్రీనివాస్, రాజన్న, శివశంకర్,అన్నపూర్ణ సేవాసమితి వారు, మరో రెండు సేవాసమితి వారు ఆలయ అర్చకులు శివ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, జూలై 29)**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరేపల్లిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఎన్యూమరేషన్ సర్వేను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు చేపడుతున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హులైన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.




## శభాష్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్


# ముఖేష్ సింగ్..?

- అక్రమ నిర్మాణం కు అండగా ఉన్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ ముఖేష్ సింగ్.
- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ముఖేష్ సింగ్ అనుకునేదే సాధించుకుంటారూ..?
- అక్రమ నిర్మాణం కు పూర్తి బాధ్యత వహించిన టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ ముఖేష్ సింగ్.... ?
- విజిలెన్స్ డిపార్ట్మెంట్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ పై ఎందుకు నిఘా పెట్టలేకపోతున్నారు.





**కుత్బుల్లాపూర్ : జూన్ 29 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని బహుదూర్ పల్లి విలేజ్ ప్రాంతంలోజరుగుతున్న అక్రమ నిర్మాణం పై పట్టించుకోని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ముఖేష్ సింగ్, దుండిగల్ సర్కిల్ 59 లో గత కొద్ది రోజుల నుండి వరస కథనాలపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణం వద్ద నుండి అక్షరాల మూడు లక్షలు ముడుపులు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ముఖేష్ సింగ్ కు అందడంతో అక్రమ నిర్మాణం సిద్ధం అవుతుంది. తను ఉద్యోగం పక్కకు పెట్టి దుండిగల్ సర్కిల్ 59 టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ ముఖేష్ సింగ్ నెంబర్ వన్


**OFFICE OF DUNDIGAL MUNICIPALITY** BuildNow
**MEDCHAL - MALKAJGIRI DISTRICT**
**BUILDING PERMIT ORDER AND WORK COMMENCEMENT LETTER**

To,

| | | |
|---|---|---|
| Smt PAILLA LAVANYA | File No: | 013564/DUND/00157/IABP/2025 |
| W/o SRI. PAILLA JANARDHAN REDDY | Permit No: | 0094/DUND/IABP/2025 |
| H.No.8-2-310/A/2, Road No.10, Ibrahim Nagar, Banjara Hills,Hyderabad, Telangana State.,-500034 TELANGANA. | Date: | 30/08/2025 |

Dear Sir/Madam,

Sub: **Dundigal Municipality** - Proposed Construction of **Individual Residential Building** consisting of **Stilt for Parking + 2 Upper Floor** , to an extent of **184.65 Sq mt**, situated at Plot No: **PLOT NO.90/PART EAST SIDE PORTION** , Locality: **BAHADURAPALLY VILLAGE**, Survey No: **60** , Village **Bahadurpally**, **Dundigal Gandimaisamma** Mandal, **Medchal - Malkajgiri** District - Building Permit Order and Work Commencement Letter - Reg.

Ref: 1. Your Application **013564/DUND/00157/IABP/2025**, dated: **21/08/2025**
2. Provisional Permit Order No. **013564/DUND/00157/IABP/2025**, dt. **21/08/2025**
3. G.O.Ms.No.168, MA&UD;, dt.07-04-2012.
4. G.O.Ms.No.7, MA&UD;, dt.05-01-2016.
5. Telangana Municipalities Act 2019 (Act No. 11 of 2019).
6. G.O.Ms.No. 62 MA&UD;, dt. 21.03.2020.
7. G.O.Ms.No. 201 MA&UD;, dt 16.11.20207.
8. Remarks of the Post verification team **30/08/2025**
9. Memo No. 2461/Plg.III/2021 dt 20.07.2023

The Instant Approval vide Provisional Building Permit Order No. **013564/DUND/00157/IABP/2025** dated. **21/08/2025** for construction of **Individual Residential** Building consisting of **Stilt for Parking + 2 Upper Floor**, has-been verified through Post Verification Team vide reference 7th cited, in terms of Rules & Regulations in force and found satisfactory.





అవినీతి ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్నట్లు స్థానిక ప్రజలలో గుసగుసలాడుతున్నారు. ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని ముఖేష్ సింగ్ జేబులోకి నింపుకుంటున్నట్లు స్థానిక ప్రజలలో చర్చించుకుంటున్నారు. ఉన్నతస్థాయి అధికారులు ఇప్పటికైనా సెక్షన్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోకపోతే జిహెచ్ఎంసి ఆదాయాన్ని భారీగా గండి కొట్టే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# సర్వేనెంబర్ 214 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు.

- పట్టించుకోని దుండిగల్ రెవెన్యూ అధికారులు
- నన్ను ఏమి చేయలే చేయలేరు అనే దీమలో భూ కబ్జాదారులు.
- రోజు రోజు కు రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు ఆగడాలు.










**కుత్బుల్లాపూర్ : జూన్ 29 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని చర్చ్ గాగిలాపూర్ ప్రాంతంలో సర్వేనెంబర్ 214 ప్రభుత్వ స్థలంలో పట్టే పగలే అక్రమ నిర్మాణం చేపడుతున్న భూకబ్జాదారులు. దుండిగల్ రెవెన్యూ అధికారులకు కళ్ళు కప్పి ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతూ అమాయక ప్రజల వద్ద నుండి లక్ష లో దండుకుంటున్న వైనం. ఇంత జరుగుతున్న భూకబ్జాదారుల ఆగడాలకు అంతులేకుంట పోతుంది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై పిడి యాక్ట్ కేసులో నమోదు చేయాలని స్థానిక ప్రజలకు కోరుతున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# వారిని అడిగేది ఎవరు ? – అడ్డుకునేది ఎవరు! ?

- ముడుపులు అందడంతోనే అధికారులు మౌనం పాటిస్తున్నారా..!?
- అమ్మేవాడు, అధికారులు మధ్య నలుగుతున్న పేదవాడు
- భూకబ్జాదారులపై చర్యలు ఉండవా?



**కుత్బుల్లాపూర్ : జూన్ 29 (పీపుల్స్ న్యూస్)**
అక్రమార్కులకు అండదండగా నిలుస్తూ అందిన కాడకు దోచుకుంటున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ కనీసం ఒక్క గంట సేపైనా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా పనిచేయాలని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని గాజుల రామారం 307 ప్రభుత్వ భూముల్లో గతంలో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేశారు. కుత్బుల్లాపూర్ రెవెన్యూ పరిధిలోకి వచ్చే ఈ 307 సర్వే నంబర్ హైడ్రా అధికారులు అక్కడ నియమిస్తున్న నిర్మాణాలపై ఆగ మేఘాల మీద చర్యలకు ఉపక్రమించి పెద్ద ఎత్తున నిర్మాణాలను కూలగొట్టారు.

**తిరిగి ప్రభుత్వ భూమి కబ్జా...**
కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ఇతర ప్రభుత్వ అధికారుల సాయంతో సర్వే నంబర్ 307 ప్రాంతంలో నిర్మించిన నిర్మాణాలను తొలగించడంలో అంతర్యం దాగి ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అక్రమంగా నిర్మాణం జరుపుతున్న వారి నుండి అధిక మొత్తంలో లంచాలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నించినట్లు వెలుగులోకి వస్తుంది. నిర్మాణాన్ని పూర్తయిన తర్వాత డిమాలేషన్ జరిగితే కబ్జాదారుల భయపడతారని, తమకు కూడా అధిక మొత్తంలో ముడుకులు అందుతాయని ఆలోచనలో అధికారులు కొంత కాలం వరకు నిర్మాణాలను తొలగించకుండా జాబ్స్ చేశారు. అనంతరం ఎవరు ఫిర్యాదు చేయనప్పటికీ ఆగమేఘాలమీద అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయితే అనంతరం అక్రమ నిర్మాణదారులకు అధికారుల మధ్య సయోధ్య నెలకొన్నందున తిరిగి అదే స్థలంలో ఇప్పుడు నిర్మాణాలుచేపడుతున్నప్పటికీ కన్నెత్తి చూడకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజల మండిపడుతున్నారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు కనీసం ప్రజల మేలు కోసం ఒక గంట సేపైనా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రజల గుర్తు చేస్తున్నారు.

**అక్రమాలు ఆగేదెలా.. అడ్డుకట్ట వేసేది ఎవరు..**
కుత్బుల్లాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 307 లో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జాదారులు 60, గజాలుగా విభజించి పేద ప్రజలను మోసం చేస్తూ విక్రయిస్తున్నారు.



పేద ప్రజలు ఏదో ఒక చోట ఉండటానికి స్థలం దొరుకుతుంది కదా అని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇలా అమ్ముకోవడం నేరమని తెలిసినా ఇంకా వేగంతో నిర్మాణాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

**అమ్మేవాడు బాగుంటాడు... అధికారులు బాగుంటారు.**
ప్రభుత్వ భూములు కబ్జా చేసేవారికి తప్పనిసరిగా అధికారుల అండదండలు ఉంటే తప్ప వారు ఒక ప్రైవేట్ రియల్ ఎస్టేట్ చేసినట్లు బాహాటంగానే ప్రభుత్వ స్థలంలో కొన్ని రేకులు గదులు వేసి పేద ప్రజలకు ఎక్కడ ఇస్తున్నారు. పేద ప్రజలేమో తమకు నగరంలో నిలువ నీడ దొరుకుతుందని వారు ఆలోచిస్తున్నారు. కానీ ప్రభుత్వాలు మారినప్పుడు గాని, అధికారులు మారినప్పుడు కానీ తిరిగి ఆ భూముల్లో నిర్మించిన నిర్మాణాలను అధికారులు తొలగించడంతో పేదలు రోడ్డున పడుతున్నారు. అమ్మేవాడు... అధికారులకు ఇక్కడ లాభం జరుగుతున్నప్పటికీ చివరగా మోసపోయి, కేసులు బారిన పడేది మాత్రం పేదవాడినని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ స్వార్థ ప్రయోజనాలను వీడి కబ్జాకు గురవుతున్న స్థలాలను కట్టడి చేసి ప్రభుత్వ ఆస్తుల పెంచాలని కోరుతున్నారు.





భూ కబ్జాదారులు రాజేంద్ర



భూ కబ్జాదారులు ఆంజనేయులు

# కిమ్స్ హాస్పిటల్స్ అరుదైన ఘనత – ఏడు ఆసుపత్రుల్లో ఒకే రకమైన సేవలకు గానూ ఏపసీఐ గుర్తింప

**హైదరాబాద్, జూన్ 29 ।** ప్రపంచ ఆరోగ్యరంగ చరిత్రలో కిమ్స్ హాస్పిటల్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. తన ఏడు ఆసుపత్రుల నెట్‌వర్క్‌లో ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రోగుల భద్రత, ఉత్తమ క్లినికల్, మెరుగైన సిబ్బందిని నిర్వహిస్తోందని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు అమెరికన్ అక్రిడిటేషన్ కమిషన్ ఇంటర్నేషనల్ (ఏఏసిఐ) నుంచి మల్టీ–సైట్ అక్రిడిటేషన్ పొందింది. దీంతో ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన తొలి హెల్త్‌కేర్ నెట్‌వర్క్?గా కిమ్స్ హాస్పిటల్స్ నిలిచింది. దీని ద్వారా నిరంతరం నాణ్యతాభివృద్ధి చేపడుతూ, విజయవంతంగా అమలు చేస్తోందని విషయాన్నీ కిమ్స్? తెలియజేస్తోంది. ఈ అంశాలను పరిశీలిస్తూ : సాధారణంగా అక్రిడిటేషన్ విధానాలు ఒకే ఆసుపత్రిని మాత్రమే అంచనా వేస్తుంటాయి. అందుకు భిన్నంగా, ఏఏసిఐ మల్టీ–సైట్ అక్రిడిటేషన్ మొత్తం ఆసుపత్రుల నెట్‌వర్క్‌ను ఒకే సమగ్ర ఆరోగ్య వ్యవస్థగా పరిగణిస్తుంది. ఇందులో ఆసుపత్రి నిర్వహణ, పరిపాలన, రోగుల భద్రత, క్లినికల్ నాణ్యత, సమానంగా సేవలందించడం, రిస్క్ మేనేజ్‌మెంట్, నిరంతరం నాణ్యతను పాటించడం వంటి అంశాల పట్ల సమగ్ర పరిశీలన చేస్తారు. కఠినమైన అంతర్జాతీయ ప్రమాణాలను విజయవంతంగా అమలు చేయడం ద్వారా కిమ్స్ హాస్పిటల్స్




ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డు నెలకొల్పింది. అంతేకాకుండా, ప్రతి కిమ్స్ ఆసుపత్రిలో రోగులకు ఒకే తరహా ప్రపంచ స్థాయి సేవలు అందించాలనే సంస్థ నిబద్ధతకు ఇది గుర్తింపుగా నిలుస్తోంది. "మూడు సంవత్సరాల క్రితం మా ఆసుపత్రుల్లో ఒక యూనిట్‌కు ఏఏసిఐ అక్రిడిటేషన్ లభించింది. ఆ గుర్తింపు అక్కడ పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, పరిపాలనా సిబ్బంది, నాణ్యతా బృందాలు, సమష్టిగా చేసిన కృషికి నిదర్శనం. అదే నాణ్యతా వ్యవస్థను ఇప్పుడు మరో ఆరు ఆసుపత్రుల్లోనూ విజయవంతంగా అమలు చేశాం. ప్రామాణిక క్లినికల్ నిబంధనలను పాటిస్తూ, హాస్పిటల్? నిర్వహణ, సైంటిఫిక్ డెవలప్?మెంట్ సిస్టమ్?, నిరంతరం నాణ్యతను మెరుగుపరిచే విధానంతో ఉత్తమ వైద్య సేవలను ఒకే ప్రమాణాలతో మా అన్ని ఆసుపత్రుల్లో అందించగలమని మరోసారి నిరూపించుకున్నాం" – డా. భాస్కర్ రావు, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీనిబద్ధతను పాటిస్తే మంచి ఫలితాలు : కిమ్స్ హాస్పిటల్స్ ప్రపంచ ఆరోగ్యరంగానికి ఒక కొత్త ప్రమాణాన్ని సృష్టించిందని క్రెసో ఆంటోనియో పాలిస్కా, గ్రూప్ సీఈఓ, అమెరికన్ అక్రిడిటేషన్ కమిషన్ ఇంటర్నేషనల్ (ఏఏసిఐ) పేర్కొన్నారు. ప్రపంచంలోనే తొలి ఏఏసిఐ మల్టీ–సైట్ అక్రిడిటేషన్ సాధించడం ద్వారా బలమైన నాయకత్వం, నాణ్యత, రోగి భద్రత, విధానాల్లో భాగమైతే ఎలాంటి ఫలితాలు సాధ్యమవుతాయో కిమ్స్ హాస్పిటల్స్ నిరూపించిందని తెలిపారు. ఇతరులకు ప్రేరణగా : ఒకే విధమైన క్లినికల్ విధానాలను పాటిస్తూ హాస్పిటల్? నెట్‌వర్క్‌లో ఒకే ప్రమాణాలను విజయవంతంగా అమలు చేయగలమని నిరూపించినట్లు కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ అనిత అన్నారు. ఈ ఘనతతో కిమ్స్ హాస్పిటల్స్ దేశంలోనే కాకుండా ప్రపంచ ఆరోగ్య రంగానికి కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మల్టీ హాస్పిటల్? నెట్‌వర్క్‌లో ఈ ఘనత సాధించడం చాలా అరుదని ఆమె తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల నెరవేరింది



**తుర్కపల్లి, జూన్ 29**
కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల నెరవేరిందని సర్పంచ్ బొత్త రాములు అన్నారు .సోమవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో దేశబోయిన కవితా నాగేష్ ల ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ఇండ్లను మంజూరి చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్ , సాప కిష్టయ్య ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆలేటి శ్రీశైలం, జూపల్లి తిరుపతి ,వార్డు సభ్యులు కలకుంట్ల సత్యనారాయణ, కలకుంట్ల బిక్షపతి, నాయకులు, కార్యకర్తలు,, పాల్గొన్నారు

# ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన కాంగ్రెస్ యువ నాయకుడు శశాంత్.

**- డిసిసి జిల్లా అధ్యక్షులు వజ్రష్ యాదవ్ ఆదేశానుసారం.**




**శామీర్ పేట్, :–** కీసర జిహెచ్ఎంసి పరిధిలోని హకీంపేట్ గ్రామంలో డిసిసి అధ్యక్షుడు వజ్రష్ యాదవ్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తూ ముకుంట కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శశాంత్ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం యువ నాయకుడు ప్రశాంత్ మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ అనునిత్యం నియోజకవర్గ ప్రజల యోగక్షేమాల కోసం పరితపిస్తూ బడుగు బలహీన వర్గాల ఆశాదీపంగా ముం దుకు సాగుతున్నారని ఆయన అడుగుజాడల్లోనే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నేను కూడా అయినంతవరకు ప్రతి ఒక్కరికి సేవ చేస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు ం

# జనగామ చెరువును కాపాడండి

**:- కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్**



**రామగుండం,జూన్ 29 :-**
పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో స్థానిక జనగామ 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ జనగామ గ్రామానికి జీవనాధారమైన చెరువును కాపాడాలని పాలన అధికారులకు వినతి పత్రం సమర్పించారు.గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుండి వచ్చే డ్రైనేజీ మురుగునీరు నేరుగా జనగామ గ్రామ చెరువులోకి చేరడంతో గ్రామ ప్రజలు, రైతులు,మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి,శుద్ధి చేసిన నీటినే చెరువులోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ చెరువుపై ఆధారపడి సుమారు 250 కుటుంబాలు, 350 ఎకరాల సాగుభూమి జీవనోపాధి పొందుతున్నాయి. ప్రస్తుతం కలుషిత నీటి కారణంగా పంటల దిగుబడి తగ్గడం,పశువులు నీరు తాగలేని పరిస్థితి ఏర్పడడం,చెరువులో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు చనిపోవడం వల్ల ముదిరాజ్, బెస్త సోదరులు తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారని వివరించారు."సింగరేణికి ప్రాణం పోసిన ఊరు నేడు పుట్టెడు కష్టాల్లో ఉంది. జనగామ చెరువును కాపాడి గ్రామానికి జీవం పోయాలి" అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో కలవేన రవీందర్,అరెల్లి రవితేజ పాల్గొన్నారు.

# నిజాయితీ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి

**-- డీజీపీ సి.వి. ఆనంద్**







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూన్ 29 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ పోలీసు శాఖలో సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) హోదా నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్లలో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతనంగా పదోన్నతి పొందిన అధికారులను అభినందించిన డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, అంతకుమించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించే అవకాశం అని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే గుర్తించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని, ప్రజలకు చేరువయ్యే అధికారులుగా మంచి పేరు తెచ్చుకోవాలని డీజీపీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాల పెంపు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. డీఎస్పీ హోదాలో ప్రతి నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఉండాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాలని ఆయన తెలిపారు. ప్రజల భద్రత, సంక్షేమమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిపరంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కాగా సి ఐ ల నుండి డిస్పీ లుగా పదోన్నతి పొందిన వీరికి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోస్టింగ్స్ కాకుండా ఇతర విభాగాల్లో తమ సేవలను నిర్వహించనున్నారు.


# పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 29 (పీపుల్స్ న్యూస్) :**
పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ కేసు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల, హౌసింగ్ బోర్డ్ కాలనీ కి చెందిన సాదంగి వెంకటేష్ అలియాస్ సాధుల వెంకటేష్,(25) రంగారెడ్డి జిల్లా , దేవేందర్ నగర్ కాలనీ, రావిర్యాల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. రావిర్యాల గ్రామంలోని దేవేందర్ నగర్ కాలనీకి చెందిన ఒక 17 సంవత్సరాల మైనర్ బాలిక 2020 ఫిబ్రవరి 09న రాత్రి నివాసం నుండి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, పొరుగున ఉండే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ 10వ తేదిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పహాడీషరీఫ్ పోలీస్ కేసు నమోదైంది.దర్యాప్తు సమయంలో పోలీసులు బాధితురాలిని సురక్షితంగా గుర్తించారు. నిందితుడు మైనర్ బాలికను అపహరించి, ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో ఆధారాలతో సహా నిరూపితమైంది. దీనితో ఈ కేసును పోక్సో చట్టంలోకి మారుస్తూ న్యాయస్థానంలో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.ప్రాసిక్యూషన్ సమర్పించిన మౌఖిక, డాక్యుమెంటరీ మరియు శాస్త్రీయ (సైంటిఫిక్) ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.20,000 జరిమానా, బాధితురాలికి రూ. 1,00,000లు పరిహారం ఇవ్వాలని కోర్టు శిక్షను ఖరారు చేసింది.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా నిరంతరం కృషి చేసిన దర్యాప్తు అధికారులు , అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, సమన్స్ అధికారి, బ్రీఫింగ్ అధికారి, లైజన్ అధికారి , దర్యాప్తుతో పాటు ట్రయల్‌లో భాగస్వాములైన పోలీసు సిబ్బంది అందరినీ ఉన్నతాధికారులు అభినందించారు.

# వర్షాల నేపథ్యంలో పోలీసు , జలవనరుల శాఖల సమన్వయంతో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి

**- రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్**













**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, జూన్ 29 (పీపుల్స్ న్యూస్) :**
రానున్న వర్షాల నేపథ్యంలో పోలీసు , జలవనరుల శాఖల సమన్వయంతో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్ సూచించారు. ప్రస్తుత వర్షాకాల ముందస్తు జాగ్రత్తలలో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్, హిమాయత్ సాగర్ డ్యామ్ , దాని పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, డ్యామ్‌కు సంబంధించిన జలవనరుల అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా ప్రతి సంవత్సరం ముందస్తుగా, ఆనవాయితిగా స్థానిక రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఒక ఫీట్ మేర గేటును పైకి లేపి నీటిని కిందకు వదలడం జరుగుతుందన్నారు. . ఈ ఆనవాయితిని అనుసరిస్తూ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ హిమాయత్ సాగర్ గేటును ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో డిసిపి ఎస్. శ్రీనివాస్ స్పందిస్తూ, అకాల వర్షాల కారణంగా ఒకవేళ డ్యామ్ పూర్తి స్థాయిలో నిండినట్లయితే, మొత్తం 17 గేట్లను ఎత్తి నీటిని వదలాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలా గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తినప్పుడు డ్యామ్ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు , ఓ.ఆర్.ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) పరిసర ప్రాంతాలలో తలెత్తే ట్రాఫిక్, ముంపు సమస్యలను ఆయన అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించారు. వరద నీటి ఉధృతి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేదా హాని జరగకూడదనే భావనతో, ముందస్తుగా తీసుకోవలసిన భద్రతా జాగ్రత్తలను డిసిపి అధికారులందరికీ క్షుణంగా వివరించారు. ముఖ్యంగా వరద ప్రభావిత , లోతట్టు ప్రాంతాలలో, రోడ్లపై సరైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసేవరకు అధికారులు, సిబ్బంది , స్థానిక ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

# సైబర్ మోసాల బాధితుల్లో మనమే టాప్ - రోజుకు 75 సైబర్ నేరాలు



ఒకరు రూ.కోటి గెలిచారు అని ఆశపెట్టి లింక్? క్లిక్? చేయమంటారు. మరొకరు స్టాక్? మార్కెట్? పెట్టుబడులంటూ ఆశ చూపుతారు. ఇంకొకరు డిజిటల్? అరెస్టు పేరిటి ఖాతా ఖాళీ చేస్తారు. ఇలా పేరు ఏదైనా చేసేది మోసమే. ఈ తరహా ఆన్?లైన్? మోసాలు దేశంలో నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒక సంవత్సర కాలంలో నమోదైన సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల కోణంలో జరిగినవి 73,624 కేసులు. వాటిలో ఒక్క తెలంగాణలోనే నమోదైన కేసుల సంఖ్య 21,987. అంటే కేవలం మన రాష్ట్రంలోనే 29.86% ఆర్థిక నేరాలు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల విడుదలైన జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.మయన్మార్, కంబోడియా, లావోస్ దేశాల్లో అడ్డాలు ఏర్పరచుకొని మోసగిస్తున్న చైనా ముఠాలతో పాటు ఉత్తరాది సైబర్ నేరస్థుల కన్ను తెలంగాణపై పడింది. దీంతో గత నాలుగు సంవత్సరాలుగా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పోగొట్టుకునే బాధితుల సంఖ్య మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంది.రోజుకు 75 సైబర్ నేరాలు : 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది.పోలీస్‌శాఖ వాదన మరోలా : అయితే రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది.

నేరగాళ్లకు చిక్కకుండా ఈ జాగ్రత్తలు పాటించండి : సైబర్ నేరాల్లో ఆర్థికమోసాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ పేరిట సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టుబడులు పెట్టొద్దని హెచ్చరిస్తున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లకు వచ్చే లింకుల్ని క్లిక్ చేసి మోసపోవద్దని చెబుతున్నారు. ఇలాంటి లింక్?ల ద్వారా ఏపీకే ఫైళ్లు మన ఫోన్?లో ఇన్?స్టాల్?

క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది.పోలీస్‌శాఖ వాదన మరోలా : అయితే రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది. అయి మన సమాచారాన్ని నేరగాళ్లకు సేకరిస్తారని వెల్లడిస్తున్నారు.డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదు : సీబీఐ, ఈడీలాంటి దర్యాప్తు సంస్థల ముసుగు వేసుకున్న మోసగాళ్లు ‘డిజిటల్ అరెస్ట్’ అంటూ ఆన్‌లైన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నారు. అలాంటి బెదిరింపులకు భయపడి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బదిలీ చేయొద్దని సూచిస్తున్నారు. అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని స్పష్టం చేస్తున్నారు. సామాజిక మాధ్యమ ఖాతాలకు తెలిసిన వ్యక్తుల నుంచి డబ్బులు పంపాలంటూ రిక్వెస్ట్ వచ్చిందంటే అది మోసమే అని గుర్తించాలని చెబుతున్నారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటే వెంటనే1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

# శేరిలింగంపల్లి చందానగర్‌లో 4 వేల గజాల స్థలం ఆక్రమణ

**- కబ్జాదారుల గుప్పిట్లో 50 కోట్ల సీఎంసీ (జీహెచ్ఎంసీ) బల్దియా భూమి!**

**- ప్రజాప్రతినిధి అండతో మున్సిపల్ అధికారుల తీరుపై మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ధ్వజం**







**శేరిలింగంపల్లి : జూన్ 29 (పీపుల్స్ న్యూస్) :**
మహిళల అవసరాల కోసం కేటాయించిన సుమారు 50 కోట్ల విలువైన సీఎంసీ భూమి కబ్జాదారుల పాలవుతున్నా మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర వీడటం లేదని చందానగర్ మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవతారెడ్డి విమర్శించారు. సోమవారం ఆమె ఘాటైన లిఖితపూర్వకంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చందానగర్ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ బాగోతం మున్సిపల్ అధికారుల అంతులేని నిర్లక్ష్యానికి, అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోందన్నారు. సొంత భూమిని రక్షించుకోవడంలో విఫలమైన అధికారుల తీరుపై ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాపాడాల్సిన అధికారులే ప్రజాప్రతినిధి అండతో కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్ కు,గత 2 సంవత్సరాలుగా పిర్యాదు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. చందానగర్ డివిజన్ కైలాష్ నగర్ కాలనీలోని సర్వే నెంబర్ 210లో సుమారు 4 వేల గజాల స్థలం ఉంది. దీని బహిరంగ మార్కెట్ విలువ దాదాపు రూ. 50 కోట్లు ఉంటుంది. ఈ స్థలంలో మహిళా భవనం, మోడల్ మార్కెట్, ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2018 (మార్చి 7న), 2019 (మే 5న) ప్రొసీడింగ్స్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించారు. దీని ప్రకారం 2019లోనే కార్పొరేషన్ అధికారులు ఆ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి, గేటు కూడా ఏర్పాటు చేశారు. అయితే, కబ్జాదారులు 2022 ఆగస్టు 10న, 2024 ఫిబ్రవరి 9న దౌర్జన్యంగా ఆ ప్రహరీని కూల్చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక మున్సిపల్ అధికారులు చోద్యం చూశారే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. స్థలం ఆక్రమణకు గురవుతుండటంపై ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా.. అధికారులు అత్యంత బాధ్యతారాహిత్యంగా బదులిచ్చారన్నారు. అది మాది కాదు ప్రభుత్వ భూమి అని, దానికి సంబంధించిన వివరాలు తమ వద్ద లేవని తప్పుడు సమాచారం ఇచ్చారని, దీంతో ఆమె స్వయంగా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలను జతచేసి.. 2024లో అప్పటి డెప్యూటీ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్‌లో సైతం జోనల్ కమిషనర్‌కు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. అయినా ఉన్నతాధికారుల్లో ఉలుకూ పలుకూ లేదన్నారు. మున్సిపల్ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకున్న కొందరు, అదే స్థలంలో టీజీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి తెరతీశారని, దీనిపై ఆర్టీఐ ద్వారా విద్యుత్ శాఖను వివరణ కోరగా.. ఆ భూమికి సంబంధించి తమ వద్ద ఎలాంటి అధికారిక కేటాయింపు పత్రాలు లేవని,ప్రజాప్రతినిధుల సూచనతో నిర్మాణం చేశామని సమాధానమిచ్చారు. ఇదే విషయమై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను నిలదీయగా.. తాము విద్యుత్ శాఖకు హెచ్ఎంసీ యాక్ట్ యూ బై ఎస్ 635 కింద నోటీసులు ఇచ్చామని చేతులు దులుపుకున్నారన్నారు. కోట్లాది రూపాయల భూమిని ఆక్రమించి,ఎలాంటి అనుమతులు లేకుండా స్థలంలో పత్రాలు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే నోటీసులు ఇచ్చి వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా జీహెచ్ఎంసీ/సీఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారు. రూ.50 కోట్ల ప్రజా ధనాన్ని కబ్జాదారులకు ధారాదత్తం చేస్తున్నారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రకారం తక్షణమే ఆ భూమిని స్వాధీనం చేసుకుని, మహిళా భవనం, ఫంక్షన్ హాల్ నిర్మించాలి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి తక్షణమే అక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మున్సిపల్ అధికారుల తీరును ఎండగడుతూ పెద్ద ఎత్తున మహిళ పోరాటం, న్యాయ పోరాటం చేస్తామని బొబ్బ నవతారెడ్డి హెచ్చరించారు.

# మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

ట్రంప్ ప్రపంచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లల్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది.అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే



ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు.

అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి.

వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి.

ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని

# ముఖం చాటేసిన నైరుతి



## దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

### ఏరువాక సాగక రైతన్న ఆందోళన

**న్యూఢిల్లీ,జూన్29**:దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8.35 సెం.మీ, కరీంనగర్ జిల్లా రామడుగులో 6.94 సెం.మీ, కరీంనగర్ రూరల్‌లో 6.15 సెం.మీ, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 5.20 సెం.మీ, మెట్‌పల్లిలో 4.31 సెం.మీ, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.20 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాళ్లలో 4.09 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు.

# తిరుమలలో ముగిసిన జేష్ఠాభిషేకం





## మహాశాంతి హోమంతో ముగించిన వేదపండితులు

**తిరుమల,జూన్29:**తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శ్రీ సదాశివరావు, శ్రీమతి జానకి దేవి ,శ్రీమతి సుచిత్ర ఎల్లా, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తిరుచానూరులో జరుగుతున్న శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారు పద్మ పుష్కరిణిలో తెప్పపై విహరించి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు.

అనంతరం గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్దనున్న నీరాడ మండపంలో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన తెప్పోత్సవంలో అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. అనంతరం గజవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. సోమవారం వార్షిక తెప్పోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారు పద్మ పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించనున్నారు. అనంతరం గరుడ వాహనంపై అమ్మవారు మాడవీధుల్లో విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

# కేతన్ అగర్వాల్ హత్యలో రోజుకో కొత్తవిషయం

## హత్యకు ముందు ప్రియుడితో మాట్లాడిన సియా గోయల్

**ముంబై,జూన్29:** మహారాష్ట్ర పుణెకు చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. హత్యకు అరగంట ముందు సియా గోయల్.. తన ప్రియుడు చేతన్ చౌదరికి ఫోన్ చేసి రహస్యంగా మాట్లాడినట్టు కాల్ డీటెయిల్ రికార్డ్స్ ఆధారంగా అధికారులు కనుగొన్నారు. మొబైల్ ఫోన్ల ఫోరెన్సిక్ విశ్లేషణ, సీడీఆర్ పరిశీలనలో ఈ విషయం బయటపడినట్టు తెలిపారు. ఈ కాల్‌ను కుట్రకు సంబంధించిన అత్యంత కీలక డిజిటల్ ఆధారంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ సంభాషణలో కేతన్‌తో తానున్న ప్రాపర్ లొకేషన్‌ను ప్రియుడు చేతన్‌కు సియా తెలిపిందని, అక్కడ ఇతర పర్యాటకులెవరూ లేరని నిర్ధారించినట్లు అనుమానిస్తున్నారు. హత్యకు సంబంధించిన ప్రణాళికను దాచిపెట్టేందుకు మూడు నెలలుగా ఇరువురూ సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫామ్స్ వేదికగా షేర్ చేసుకున్న మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ వివరాలను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. సదరు డేటాను సైబర్ నిపుణుల సాయంతో వెలికితీసేందుకు యత్నిస్తున్నట్టు తెలిపారు. తొలగించిన సమాచారం, లొకేషన్ వివరాలు, ఇంటర్నెట్ ఐపీ అడ్రస్‌లను పోల్చి చూసి.. ఈ కుట్రను నిరూపించే దిశగా ఆధారాలు సేకరిస్తున్నట్టు స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేతన్, సియాలకు నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది.

కానీ ఈ పెళ్లి తనకు ఇష్టం లేకపోవడంతో సియా.. జూన్ 18న లోహగడ్ కోటకు కేతన్‌ను తీసుకెళ్లి కొండపై నుంచి తోసి హతమార్చింది. ఈ కేసులో ఆమె ప్రియుడు చేతన్ చౌదరీ కూడా నిందితుడిగా ఉన్నాడు. కాగా.. మే నెలాఖరులోనే సియా ఈ హత్యకు ఎ÷-లాన్ చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. జూన్ 14న తొలిసారి కేతన్‌ను కొండపై నుంచి తోసేందుకు యత్నించగా.. అదృష్టవశాత్తూ కేతన్ తనను తాను కాపాడుకుని ప్రాణాలతో బయటపడ్డారని వెల్లడించారు. ఆ సమయంలో పాము కనిపించడంతో అనుకోకుండా అలా జరిగిందని సియా కట్టుకథ అల్లినట్టు చెప్పారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో ఈ నెల 18న రెండోసారి పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. ఈ ఎ÷-లాన్‌లో కేతన్ తప్పించుకోకుండా ఉండేందుకు చేతన్ కూడా వారిని వెంబడించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. గోయల్, చౌదరీల ఫోన్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాలు బయటపడినట్టు తెలుస్తోంది.


# పశ్చిమాసియా ఉద్రిక్తలకు తాత్కాలిక చర్యలు



## నేడు దోహా వేదికగా అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు

**న్యూఢిల్లీ,జూన్29:** పశ్చిమాసియాలో ఇటీవల మళ్లీ చెలరేగిన ఉద్రిక్తతలకు తాత్కాలికంగా విరామం లభించనుంది. అమెరికా, ఇరాన్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరస్పర దాడులను నిలిపివేయాలని ఒక ఒప్పందానికి వచ్చాయి. అలాగే మంగళవారం ఇరు దేశాల ప్రతినిధులు ఖతార్‌లోని దోహాలో సమావేశం కానున్నారు. ఈ చర్చల్లో హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన భద్రత, వాణిజ్య రవాణా పునరుద్ధరణ, ప్రాంతీయ స్థిరత్వం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణానికి హామీ ఇవ్వడానికి ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఇరాన్ నౌకాశ్రయాలపై అమలులో ఉన్న కొన్ని పరిమితులను సడలించే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది పూర్తిస్థాయి శాంతి ఒప్పందం కాదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు . ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, హోర్ముజ్ జలసంధిపై భద్రతా అంశాలు వంటి కీలక సమస్యలపై ఇంకా తుది అంగీకారం కుదరాల్సి ఉంది . ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. 24 గంటల వ్యవధిలోనే, అమెరికా రెండుసార్లు ఇరాన్ సైనిక స్థావరాలు, డ్రోన్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఇరు దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

# శ్రీకృష్ణుడు సంచరించిన పుణ్యక్షేత్రాలు- సప్త మోక్ష ధామాల విశేషాలివే!



మన సంప్రదాయం ప్రకారం దేవాలయ సందర్శన అనేది కేవలం పూజలు, ప్రార్థనలకు మాత్రమే పరిమితం కాదు. ఇది మన సంస్కృతి, ఆధ్యాత్మికత, శాస్త్రీయత మరియు మానసిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తుంది. మహాభారతంలో పాండవులు, రామాయణంలో శ్రీరాముడు, పరశురాముడు, బలరాముడు వంటి గొప్ప గొప్ప పురాణ పురుషులు కూడా పవిత్ర క్షేత్రాలను, ఆలయాలను సందర్శించి తీర్థయాత్రల ఆవశ్యకతను మానవాళికి తెలియజేసారు. ఈ క్రమంలో ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు సంచరించిన పుణ్య ప్రదేశాలు సప్త మోక్ష ధామాలుగా విరాజిల్లుతున్నాయి. హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు శ్రీకృష్ణుడు సంచరించిన ఈ 7 క్షేత్రాలు దర్శించాలని పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణుడు నడయాడిన పుణ్య ప్రదేశాలు నేటి మోక్ష ధామాలుశ్రీకృష్ణుడు తాను జన్మించిన దగ్గర నుంచి అవతార పరిసమాప్తి చెందే వరకు సంచరించిన ప్రదేశాలు నేడు పుణ్య ధామాలుగా విరాజిల్లుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం.

**శ్రీకృష్ణ జన్మభూమి, మథుర (ఉత్తరప్రదేశ్)**

శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర ప్రదేశం మథుర. ఉత్తరప్రదేశ్?లో వెలసి ఉన్న ఈ క్షేత్రం శ్రీకృష్ణుని జన్మస్థలంగా ప్రసిద్ధి చెందింది. యాదవ వంశానికి చెందిన కృష్ణుడు ఇక్కడే కంసుని చెరసాలలో దేవకీ వసుదేవులకు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడే శ్రీకృష్ణ జన్మస్థానంగా ప్రసిద్ధి చెందిన చెరసాలను చూడవచ్చు. మథురలో శ్రీ కృష్ణ జన్మభూమి మందిరం, ద్వాకాధీశ్ ఆలయం, బిర్లా మందిర్ దర్శనీయ స్థలాలు.

**ద్వారకాధీష్ ఆలయం, ద్వారక (గుజరాత్)**

శ్రీకృష్ణుడు తన రాజ్యమైన ద్వారకను నిర్మించుకున్న ప్రదేశమే ద్వారకా నగరం. ఇక్కడే ద్వారకాధీశుని ఆలయం వెలసి ఉంది. ఈ మందిరాన్ని 'జగత్ మందిర్' అని కూడా పిలుస్తారు. శ్రీకృష్ణుని మనవడైన 'వజ్రనాభుడు' ఈ ఆలయాన్ని నిర్మించాడని పురాణాలు చెబుతున్నాయి. గోమతి నది ఒడ్డున 5 అంతస్తులు, 72 స్తంభాలతో ఈ ఆలయం విరాజిల్లుతోంది. ద్వారకలో ప్రధాన ఆలయమైన జగత్ మందిరంతో పాటు, సముద్రంలో మునిగిపోయిన పాత ద్వారకను సూచించే 'బేట్ ద్వారక ను కూడా భక్తులు దర్శించుకుంటారు.

**బాంకే బిహారీ ఆలయం, బృందావనం (ఉత్తరప్రదేశ్)**

శ్రీకృష్ణుని బాల్య లీలలకు ప్రసిద్ధి చెందిన బృందావనంలో ఈ బాంకే బిహారీ ఆలయం ఆలయం ఉంది. ఇక్కడ కృష్ణుడని బాలుడిగా, ఠాకూర్ జీగా పూజిస్తారు. ఇక్కడ ఏడాదిలో ఒక్కసారి అక్షయ తృతీయ రోజున మాత్రమే భక్తులు బాలకృష్ణుడి పాదాలను దర్శించుకునే అవకాశం ఉంటుంది. రాధా వల్లభ ఆలయం, నిధివన్ ఇక్కడ దర్శనీయ స్థలాలు.

**గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయం (కేరళ)**

గురువాయూర్?ను 'భూలోక వైకుంఠం' అని పిలుస్తారు. ద్వాపర యుగాంతంలో దేవగురువు బృహస్పతి, వాయుదేవుడు కలిసి ఇక్కడ శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించినట్లుగా తెలుస్తోంది. ద్వాపర యుగంలో ఏర్పడిన ప్రళయంలో ద్వారకా నగరం మునిగినప్పుడు శ్రీకృష్ణుడే తన విగ్రహాన్ని తన శిష్యునికి ఇచ్చినట్లుగా తెలుస్తోంది. సముద్ర జలాలపై తేలియాడుతూ వస్తున్న శ్రీకృష్ణుని విగ్రహాన్ని బృహస్పతి, వాయుదేవుడు ప్రతిష్టించినందున క్షేత్రానికి గురువాయూర్ అని పేరు వచ్చింది.

**ఉడిపి శ్రీకృష్ణ మఠం (కర్ణాటక)**

ఉడిపి శ్రీ కృష్ణ మఠం ఉడిపిలోని అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. 13వ శతాబ్దంలో ద్వైత సిద్ధాంత కర్త అయిన శ్రీ మాధవాచార్యులు దీనిని స్థాపించారు. ఇక్కడ శ్రీకృష్ణుని ఒక చిన్న నవగ్రహ కిటికీ ద్వారా దర్శించుకోవడం ఒక ప్రత్యేక ఆచారం. ఇక్కడే ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని రుక్మిణి దేవి పూజించిందని నమ్ముతారు.

**పూరీ జగన్నాథ ఆలయం (ఒడిశా)**


శ్రీకృష్ణుడు తన సోదరుడు బలరాముడు, సోదరి సుభద్రలతో కలిసి కొలువైన అతి ప్రాచీనమైన మరియు ప్రసిద్ధ ఆలయం. ఆషాఢమాసంలో ఇక్కడ జరిగే పూరి జగన్నాథ్ రథయాత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

**ఇస్కాన్ ఆలయాలు**

ప్రపంచవ్యాప్తంగా శ్రీకృష్ణ భక్తిని వ్యాప్తి చేసిన ఇస్కాన్ సంస్థకు చెందిన ఆలయాలు దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఉన్నాయి. ఈ ఆలయాలన్నీ ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణ క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇస్కాన్ సంస్థ ద్వారా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయాల్లో విగ్రహాలు పాలరాతితో, జీవకళ ఉట్టిపడేలా ఉండడం విశేషం.శ్రీకృష్ణ మోక్ష ధామాలుగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రాల దర్శనం మోక్షకారమని విశ్వాసం.జైశ్రీకృష్ణ!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసిం

# అందరూ సమానమే అని చాటిచెప్పే 'మేల్‌మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం'- నెలసరి సమయంలోనూ అమ్మవారిని పూజించొచ్చు!





సృ ష్టికి మూలం ఆది పరాశక్తి. ఈ తల్లి దృష్టిలో అందరూ సమానమే! కులమత భేదాలు, స్త్రీ పురుష లింగ, వయో భేదాలు లేకుండా అందరినీ సమదృష్టితో ఆదరించే కరుణామయి. ఈ వాస్తవాన్ని అందరికీ చాటి చెప్పాలనే స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఆలయమే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం. ఎరుపు రంగు వస్త్రాలు ధరించి, నిరంతరం 'ఓం శక్తి' అంటూ అమ్మవారిని ధ్యానించే భక్తులతో ఎల్లప్పుడూ కిటకిటలాడుతుండే ఈ ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం ఎక్కడుంది?తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్పట్టు జిల్లాలో మేల్ మరువత్తూర్ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి పీఠాన్ని బంగారు అడిగళార్ అనే స్వామిజి నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఒకానొకప్పుడు ఈ క్షేత్రంలో 21 మంది సిద్ధపురుషులు జీవసమాధి పొందారట! అందుకే ఈ క్షేత్రానికి సిద్ధర్ క్షేత్రమని పేరు వచ్చింది.

**స్వయంభువుగా కొలువైన పరాశక్తి**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో ఆది పరాశక్తి సహస్రదళ పద్మంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తోంది. భక్తుల సకల మనోభీష్టాలు నెరవేర్చడంతో పాటు ఆత్మజ్ఞానాన్ని కూడా ప్రసాదించే ఈ తల్లి కులమత భేదాలకు అతీతంగా అందరినీ సమానంగా అనుగ్రహిస్తుంది. దుర్గ, పార్వతి, సరస్వతి, మహాలక్ష్మి రూపాల్లో జగన్మాత పూజలందుకుంటున్న ఈ క్షేత్రంలో ఆదిపరాశక్తి స్వయంభువుగా కొలువై ఉండడం విశేషం.

**ఆలయ స్థల పురాణం**

ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు పెద్ద వేప చెట్టు ఉండేది. కొన్ని రోజులకు వేప చెట్టు నుంచి పాలు కారుతుండేవి. స్థానికులు కొంతమంది ఆ పాలను రుచి చూస్తే అవి తియ్యగా ఉన్నాయి. అంతేకాదు ఆ పాలు సేవించిన వారికి దీర్ఘకాలిక అనారోగ్యాలు సైతం నయమయ్యాయంట! ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా వ్యాపించడంతో భక్తులు తండోపతండాలుగా రావడం మొదలు పెట్టారు. వచ్చిన భక్తులు ఈ వేపచెట్టు పాలను తీర్థంగా స్వీకరిస్తూ, వేపచెట్టును పూజించడం మొదలు పెట్టారు.

**తుఫానుకు కూలిన వేపచెట్టు**

కొంతకాలానికి ఒక భయంకరమైన తుఫాను వచ్చి ఈ భారీ వేప చెట్టు వేళ్లతో సహా పెకిలించు కుని రావడంతో ఆ చెట్టుకింద భూగర్భంలో ఉన్న అమ్మవారి విగ్రహం బయట పడిందట!

**బంగారు అడిగళార్**

ఆ సమయంలో ఆ ప్రాంతంలో లెక్కల టీచర్?గా పనిచేస్తున్న బంగారు అడిగళార్ అనే వ్యక్తి దేవి రూపాన్ని ఆది పరాశక్తిగా గుర్తించి, ప్రతిష్ఠించి ఆరాధించి శాస్త్రోక్తంగా పీఠాన్ని స్థాపించి పూజలు ప్రారంభించారు. అప్పటి నుంచి భక్తులు దేవిని ఆరాధించడంతోపాటు బంగారు అడిగళార్?ను 'బంగారు అమ్మ' అని పిలుస్తూ భక్తితో సేవించసాగారు.

**ఆలయ విశేషాలు**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి ధ్యానానికి ప్రతీక. జగన్మాత జ్ఞానముద్ర తో దర్శనమిచ్చే ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల స్థానంలో సప్తకన్నియర్ పేరుతో పరాశక్తి పరివార దేవతలైన సప్తమాతృకల ఆలయం ఉంటుంది. ఇక్కడ ఆది పరాశక్తి స్వయంభువు అయినా, గణపతి స్థపతి తయారు చేసిన దేవి విగ్రహాన్ని కూడా భక్తులు దర్శించుకుంటారు.

**అందరికీ ఒకటే దర్శనం**

అమ్మవారి సమక్షంలో అందరూ సమానమే అని తెలపడానికి ఈ ఆలయంలో అందరికీ సర్వదర్శనమే ఉంటుంది. అలాగే కులమతాలతో సంబంధం లేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమ్మవారిని పూజించుకోవచ్చు.

**నెలసరి సమయంలోను పూజించవచ్చు**

సాధారణంగా మహిళలు నెలసరి సమయంలో దేవతారాధనకు, పూజకు దూరంగా ఉండటం సాధారణం. కానీ ఈ ఆలయంలో మహిళలు అమ్మవారిని నెలసరి సమయంలో కూడా పూజించవచ్చు.

**పూజోత్సవాలు**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ ఆది పరాశక్తి ఆలయంలో ప్రతిరోజూ అభిషేకం, అర్చనలు జరుగుతాయి. ప్రతి మంగళవారం, అమావాస్య , పౌర్ణమి తిథుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

**నిత్యాన్నదానం**

ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ నిత్యాన్నదానం జరుగుతుంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడ అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు ఈ దేవస్థానం ట్రస్టు తరఫున ఉచిత వైద్య సేవలు, విద్యా సేవలు నిర్వహిస్తున్నారు. మహిళలకు వృత్తి విద్యల్లో శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

**ఇరుముడి దీక్ష**

స్త్రీ పురుష భేదం లేకుండా ఎరుపు వస్త్రాలు ధరించి, శక్తి మాల దీక్షాధారణతో సమర్పించే ఇరుముడి ఉత్సవం చూసి తీరాల్సిందే!


**ఎలా చేరుకోవాలి?**

చెన్నై నుంచి చెంగల్పట్టు మార్గంలో ఉండే ఈ ఆలయానికి చేరుకోవడానికి మేల్ మరువత్తూర్ రైల్వే నుంచి ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు. దర్శించినంత మాత్రాన్నే అభీష్టాలు నెరవేర్చే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రాన్ని మనం కూడా దర్శించి తరిద్దాం.

**ఓం శ్రీ మాత్రే నమః**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# "పని భారం, ఒత్తిడి"తో అలసిపోతున్నారా? మీ ప్రాధాన్యతలను మార్చుకోమంటున్నారు నిపుణులు!



'రోజులో 17,18 గంటలు పనిచేసినా సంతృప్తి లేదు. ఇక పని భారం ఎక్కువవుతుంది. ఒత్తిడి తట్టుకోలేకున్నా, అవకాశాలు రావడం లేదు' అంటూ ఎన్ని సమస్యలు చెబుతుంటారు మహిళలు. ఇవన్నీ నిజమే కానీ, వీటికి ప్రధాన కారణం మాత్రం సరైన ప్రాధాన్యతల్ని పాటించకపోవడమే అని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో మీరీ ప్రాధాన్యతల్ని పాటిస్తున్నారో లేదో చెక్ చేసుకోమంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!టైం కేటాయించుకోకపోవడం : లేడికి లేచిందే పరుగు అన్నట్లు రోజులో తమకంటూ అరగంటైనా కేటాయించుకోవడానికి వెనకడుగు వేస్తారు. టైం లేదంటూ సరిపెట్టుకుంటారు. అందుకే చిన్నచిన్న అపజయాలకే కుంగిపోతుంటారు. 'నేనింత కష్టపడుతున్నా ఏం లాభం లేదంటూ' నిట్టూరుస్తుంటారు. దీనికి ప్రధాన కారణం ఆత్మసంతృప్తి లేకపోవడమే అంటున్నారు నిపుణులు. అందుకే, మీకంటూ అరగంటైనా కేటాయించుకని, తర్వాత రోజుని మొదలుపెడితే ఏ సమస్యా ఉండదని చెబుతున్నారు.వయస్సు పెరిగే కొద్ది వేధించే చర్మ సమస్యలు - ఇలా చేస్తే సహజంగా తగ్గించుకోవచ్చుట!బాధ్యతలు తీసుకోకపోవడం : చాలామంది ఆడవాళ్లు ఎంత పనైనా చేస్తారు కానీ, నాయకత్వ బాధ్యతలు మాత్రం మాకొద్దు అంటుంటారు. మేం అందుకు అర్హులం కాదు, అదనపు ఒత్తిడి, సహకారం ఉండదు వంటి కారణాలు చెబుతారు. కానీ, అవకాశం వచ్చినప్పుడు బాధ్యతలు తీసుకోవడానికి వెనకాడకూడదని నిపుణులు చెబుతున్నారు. విజయం సాధించడానికి పరిమితుల్ని దాటి ప్రయత్నం చేయాలంటున్నారు.అంతటితో ఆగిపోవడం : 'నా దగ్గర చాలా డిగ్రీలు ఉన్నాయి. నా ఉద్యోగానికి ఎలాంటి ఢోకా లేదు' అంటూ జాబ్‌లో చేరిన కొన్నాళ్లకే కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపనను వదిలేస్తారు. దీనివల్ల తమ కెరీర్? గ్రోత్?లో వెనకబడిపోతుంటారు. ఈ క్రమంలో రంగమేదైనా నిత్య విద్యార్థిలా ఉండాలంటునా న్నరు నిపుణులు. కొత్త నైపుణ్యాలు, పుస్తకాలు, అనుభవాలు, శిక్షణలు అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలని సూచిస్తున్నారు.వెనకడుగు వేయడం: ఎలాంటి నిర్ణయాలైనా తీసుకుంటారు. అవి ఏమాత్రం బెడిసి కొట్టినా తమని తాము నిందించుకుంటారు. కొంతమంది అయితే తమ నిర్ణయాల వల్ల ఎదుటి వాళ్లు ఎక్కడ బాధపడుతారని వెనకడుగు వేస్తుంటారు. అయితే, మీరు తీసుకునే ప్రతి నిర్ణయం అందరినీ సంతోషపెట్టలేదని తెలుసుకుని ముందడుగు వేయాలంటున్నారు నిపుణులు. మనం చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు వెళ్లే ధైర్యాన్ని కూడగట్టుకోవడమే విజయానికి తొలిమెట్టని చెబుతున్నారు .అలాగే, సమతులాహారం, మానసిక ఆరోగ్యం, విశ్రాంతి, సరైన నిద్ర కూడా ఆరోగ్యకర జీవనంలో భాగమేనని మరచిపోకూడదు. రోజులో వీటి ప్రాధాన్యాన్ని తగ్గించకూడదు. డబ్బును సంపది ంచడమే కాదు, దాన్ని పొదపు - మదుపు చేయడం, పెట్టుబడులు పెట్టడం, భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందింకోవడం కూడా ముఖ్యమంటున్నారు నిపుణులు.ఈ క్రమంలో లక్ష్యాలు పెట్టుకుని, ఎప్పటికప్పుడు రివ్యూ చేసుకుంటూ ఉండాలి. చిన్న చిన్న విజయాల్ని కూడా ఆస్వాదిం డిప్రెషన్, అసంతృప్తులు మీ దరి చేరవట.

# ఎలా గుర్తుపట్టాలో తెలుసా 'బంగారం'! - రంగు చూసి చెప్పేయొచ్చు!



బంగారంలో కలిపే లోహాల ఆధారంగా రంగు, మెరుపు మారుతుంది. రాగి కలిపితే ఎరుపు వర్ణం వచ్చే 'రోజ్ గోల్డ్'గా, వెండి కలపడం వల్ల తేలికపాటి రంగుతో మరింత మెరుస్తుంది. జింక్, నికెల్ వంటి ఇతర లోహాలు కలిపినపుడు బంగారం బలంగా మారుతుంది. బంగారంలో వివిధ రకాల లోహాలను కలిపి విభిన్న రంగుల్లో, డిజైన్లలో ఆభరణాలు తయారు చేస్తుంటారు.ం, చెవి దిద్దులు, చేతి బ్రేస్?లెట్, వేళ్లకు ఉంగరాలు! ఇలా బంగారు నగలు అనేకం ఉన్నా వాటి తయారీ సహా మెరుపు కోసం ఇతర లోహాలను కలపడం అనివార్యం. అందుకే నగలన్నీ ఒకే రంగులో ఉండవు. బంగారాన్ని మెరిపించడానికి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి తయారీదారులు లోహాలను ఉపయోగిస్తుంటారు. ఇతర లోహాల శాతం ఆధారంగా బంగారాన్ని క్యారెట్లలో కొలుస్తుంటారు.ఎంతో సున్నితమైన బంగారంలో రాగి, నికెల్, వెండి, పల్లాడియం వంటి లోహాలను కలిపితేనే ఆభరణాలు తయారు చేయడానికి వీలవుతుంది. బంగారంలో ఇతర లోహాలు ఎంత మొత్తంలో కలిపారో 'క్యారెట్' తెలుపుతుంది. అందుకే "24 క్యారెట్లు, 22 క్యారెట్లు, 18 క్యారెట్లు" అని బంగారం స్వచ్ఛతను కొలుస్తారు. క్యారెట్ వాల్యూ పెరిగే కొద్ది బంగారం స్వచ్ఛత పెరిగి ధర ఎక్కువగా ఉంటుంది.మెరిసేదంతా బంగారం కాదండీ! - ఆభరణాలు కొనేటప్పుడు ఈ టిప్స్? పాటిస్తే బెస్ట్?!

చూసి గుర్తించొచ్చు. 24 క్యారెట్ల బంగారం మెరుస్తూ ఉంటే 22 క్యారెట్ల బంగారం మెరుపు కాస్త తక్కువగా, డార్కిష్‌గా ఉంటుంది. ఇతర లోహాలు కలిసేకొద్దీ బంగారం రంగు మారుతుంది. వైట్ గోల్డ్‌లో నికెల్ ఎక్కువగా ఉంటుంది.24 క్యారెట్ల బంగారం (ాబతీవ +శీశ్రీస) 99.9 శాతం స్వచ్ఛమైంది. ఇందులో ఇతర లోహాలేవీ ఉండవు. దీని ధర ఎక్కువగా ఉంటుంది. ఇక 22 క్యారెట్ల బంగారం (91.6 శాతం)లో మిగిలిన రెండొంతుల్లో రాగి, జింక్ లాంటి లోహాలు కలిసి ఉంటాయి. అందుకే 24 క్యారెట్ల బంగారంతో పోల్చి చూస్తే 22 క్యారెట్ల బంగారం బలంగా ఉంటుంది. ఆభరణాల తయారీకి అనుగుణంగా ఉంటుంది.

ఇక 18 క్యారెట్ల బంగారంలో ఆరు భాగాలు ఇతర లోహాలు కలిసి ఉంటాయి. ఇందులో బంగారం స్వచ్ఛత 75 శాతం కాగా, 25 శాతం జింక్, రాగి, నికెల్ లాంటి లోహాలు ఉంటాయి. 24, 22 క్యారెట్ల బంగారం కంటే ఇది మరింత దృఢంగా ఉంటుంది. 14 క్యారెట్ల బంగారంలో 58.3 శాతం పుత్తడి, మిగిలిన 41.7 శాతం ఇతర లోహాలు ఉంటాయి. మార్కెట్లో 10 క్యారెట్లు, 9 క్యారెట్ల బంగారం కూడా అందుబాటులో ఉంది.

## రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి..



- ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**సిద్దిపేట జూన్ 29 :** నంగునూరు మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువులు, రసాయన మందుల దుకాణాలను సోమవారం ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాల నాణ్యత, గడువు తేదీలు, ధరల జాబితా, విక్రయ విధానాలను పరిశీలించి వ్యాపారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. కాలం చెల్లిన విత్తనాలు విక్రయించరాదని, ఎంఆర్పీ కంటే అధిక ధరలు వసూలు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులకు ప్రతి కొనుగోలుకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సన్న వడ్ల విత్త నాలనే రైతులకు అందించాలని, ప్రభుత్వ నిబం ధనలను (నార్మ్స్) తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి ఎలాంటి ఇబ్బ ందులు తల త్తకుండా చూడాలని వ్యాపా రులను కోరా రు. ఈ కార్యక్రమంలో రైతులు, దుకాణ యజ మానులు, నంగునూర్ యువత పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రత వారోత్సవాల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ సిబ్బంది!

**హుస్నాబాద్ జూన్ 29 :** విద్యుత్ భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అనే అవగాహనను ప్రజల్లో పెంపొందించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారి ాణజు ఉదయ్ కుమార్ సిబ్బంది విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణ మార్గాలు, విద్యుత్ తీగలు మరియు అగ్నిమాపక పరిక రాలను సురక్షితంగా ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించారు. సమా వేశం నిర్వహించి భద్రతా నియమాలను వివరిం చారు. విద్యుత్ ప్రమాదాలను తగ్గించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా భద్రతా సూచనలను పాటించాలని వారు సూచి ంచారు. విద్యుత్ భద్రత వారోత్సవాలు విద్యుత్ శాఖ సిబ్బంది భద్రత పై చైతన్యం



పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది లావుడ్యా రాజు నాయక్, సాంబరాజు, తోట్ల శ్రీకాంత్, మొగిలి తదితరులు పాల్గొన్నారు

## ఏడుపాయల్లో కన్నుల పండువగా అమ్మవారి పల్లకీ సేవ



**మెదక్ :** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో సోమవారం నాడు పౌర్ణమినీ పురస్కరించుకుని అమ్మవారి పల్లకీ సేవ కన్నుల పండువగా ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగురంగు లతో, విద్యుత్ కాంతులతో అత్యంత సుందరంగా ముస్తాబు చేసిన అనంతరం ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఏడుపాయల పుర మాడ వీధుల్లో శోభాయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పల్లెసాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ న్యాయవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కురిమిల్ల రమేష్ (మాటూరి)

**వరంగల్ :** సామాజిక న్యాయ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షునిగా నర్సంపేట పట్ట ణానికి చెందిన కురుమిళ్ళ రమేష్ (మా టూ రి)ను నియమించినట్లు సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు యాషబోయిన సాంబ య్య మరియు విశ్వబ్రాహ్మణ సామాజిక న్యావే దిక రాష్ట్ర అధ్యక్షులు శృంగారపు భాస్కరాచారి లు సంయుక్తంగా ప్రకటించారు. కురుమళ్ళ రమేష్ (మాటూరి) గత 20 సంవత్సరాల నుండి విశ్వబ్రాహ్మణ సంఘాలతో పాటు సామా జిక సేవలు గుర్తించి ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ సామాజిక న్యాయవేదికకు అధ్య క్షులుగా నియమించడం జరిగిందని రమేష్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమ కొండ వరంగల్ ములుగు భూపాలపల్లి మహబూబాద్ జనగాం జిల్లాలలోని విశ్వబ్రా హ్మణుల అభివృద్ధి కోసం విశ్వబ్రాహ్మణుల కు



సామాజిక న్యాయం జరిగేందుకు తమ వంతు కృషి చేస్తానని కురిమిళ్ళ రమేష్ (మాటూరి) తెలిపారు. విశ్వబ్రాహ్మ ణుల ను ప్రభుత్వాలు ఏమాత్రం గుర్తించడం లేదని సమాజంలో విశ్వబ్రాహ్మణుల వృత్తికి ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ప్రభుత్వాల నుండి ఎలాంటి ఆదరణ లేక పోవడంతో విశ్వబ్రాహ్మణులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విశ్వబ్రాహ్మణులను గుర్తి ంచి వారికి ప్రత్యేకమైన సంక్షేమ పథకాలు అ మలు చేయాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు.

## వైద్య శిరోమణి అవార్డు 2026 కు డాక్టర్ బి రవీంద్ర నాయక్ ఎంపిక




**హైదరాబాద్, :** వైద్య ,ఆరోగ్య , కుటుంబ సంక్షేమ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ బి. రవీందర్ నాయక్ జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రం నుంచి ఒక్కరికి ఇచ్చే ఈ అవార్డును జులై 1వ తేదీన ఉదయం 11 గంటలకు కోటి లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో వైద్య శిరోమణి అవార్డు 2026 ను ప్రదానం చేస్తున్నట్టు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ నేడు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గత 35 సంవత్సరాలుగా నిరంతరంగా రోగరహిత సమాజం కోసం, నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో అవగాహన శిబిరాలు ,ర్యాలీలు, సదస్సులు నిర్వహించి ఎన్నో అందుకున్నారు. వరంగల్, ఖమ్మం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో వైద్యరంగంలో అనేక సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ గా సేవలందిస్తున్నారు. నిరుపేద ప్రజలను ఆరోగ్యం పట్ల చైతన్యవంతులను చేసేందుకు ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేస్తున్నట్టు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ తెలిపారు. ఉస్మానియా వైద్య కళాశాల నుండి ఎంబీబీఎస్, డిసిహెచ్ పూర్తి చేశారు

# వర్షాకాలంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి

- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్









**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 29 (పీపుల్స్ న్యూస్) :** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు, వాటర్ లాగింగ్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. సమావేశంలో సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ , ఆక్టోపస్ కు చెందిన సుమారు 150 మంది సిబ్బందిని ట్రాఫిక్ విధుల్లో పోలీస్ స్టేషన్‌ల వారీగా ఎలా వినియోగిస్తున్నారనే అంశంపై సమీక్ష నిర్వహించి, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూ-టర్న్ లను అడ్డుకునే వాహనాలపై మరియు రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలోని వాటర్ లాగింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. వాటర్ లాగింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమస్యలు తలెత్తే ప్రాంతాలపై సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని, రోడ్డు కటింగ్ పనులు చేపట్టే ముందు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విప్రో జంక్షన్, డీఎల్‌ఎఫ్ జంక్షన్, షాపూర్ నగర్, కూకట్‌పల్లి వై-జంక్షన్, మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు ధరించాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.


# అధికమవుతున్న కళ్లు పొడిబారే సమస్య.. జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు



ప్రస్తుతం పెరుగుతున్న స్క్రీన్ వినియోగం, వాయు కాలుష్యం, ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో ఎక్కువసేపు గడపడం వంటి కారణాలతో కళ్ల నుంచి నీరు కారడం, మంట, చికాకు వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. చాలామంది కళ్లలో నీరు వస్తే కళ్లకు తేమ బాగానే ఉందని భావిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో అదే లక్షణం డ్రై ఐ (కళ్లు పొడిబారడం) సమస్యకు సంకేతంగా ఉంటుందని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కళ్ల నుంచి నిరంతరం నీరు కారడం, అదే సమయంలో డ్రై ఐ అని నిర్ధారణ కావడం పరస్పర విరుద్ధంగా అనిపించినా, ఇది సాధారణంగా కనిపించే పరిస్థితే. కంటి ఉప రితలాన్ని కప్పి ఉంచే కన్నీటి పొరలో నూనె, నీరు, శ్లేష్మం అనే మూడు పొరలు ఉంటాయి. ఇవన్నీ సమతుల్యంగా ఉన్నప్పుడే కంటి ఉపరితలం తేమగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పొర దెబ్బతిన్నప్పుడు కంటి నుంచి మెదడుకు సంకేతం వెళ్లి అత్యవసరంగా ఎక్కువ కన్నీరు ఉత్పత్తి చేస్తుంది. దీనినే రిఫ్లెక్స్ టియరింగ్ అంటారు. ఈ కన్నీరు ఎక్కువగా వచ్చినప్పటికీ కంటికి అవసరమైన తేమ మాత్రం అందదు. అందుకే కంటి పొడిబారినట్లే ఉండి, ఒకేసారి నీరు కూడా కారుతూ ఉంటుంది. జీవనశైలి మార్పులే కారణం..ఇటీవలి కాలంలో డ్రై ఐ సమస్య వేగంగా పెరగడానికి జీవనశైలిలో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా చెబుతున్నారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు ఎక్కువసేపు ఉపయోగించినప్పుడు సాధారణంగా కళ్లను మూసి తెరిచే సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. దీంతో కనురెప్పలలోని ఆయిల్ గ్రంథులు సరిగా పనిచేయకపోవడం, కన్నీటి పొర వేగంగా ఆవిరైపోవడం జరుగుతుంది. దీనికి తోడు కాలుష్యం, ఎయిర్ కండిషన్డ్ కార్యాలయాలు, ఎక్కువసేపు ప్రయాణాలు వంటి అంశాలు కూడా ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. సాయంత్రం సమయానికి కళ్ల నుంచి నీరు ఎక్కువగా కారడం, కళ్లలో మంట లేదా గుచ్చినట్లు అనిపించడం, చూపు అప్పుడప్పుడు మసకబారినా రెప్పవేయగానే మళ్లీ స్పష్టంగా కనిపించడం, గాలి లేదా ఏసీ తగిలితే అసౌకర్యంగా అనిపించడం, రాత్రి బాగా నిద్రపోయినా కళ్లలో అలసటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా ఇవి రెండు వారాలకు పైగా కొనసాగితే తప్పకుండా కంటి వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయండి.. ఈ సమస్యను తగ్గించేందుకు కనురెప్పలపై గోరువెచ్చని వస్త్రంతో కాపడం పెట్టడం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారం లేదా సప్లిమెంట్లు తీసుకోవడం, ప్రిజర్వేటివ్‌లు లేని లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడడం, స్క్రీన్ ముందు ఎక్కువసేపు గడిపేటప్పుడు మధ్య మధ్యలో విరామం తీసుకుని ఉద్దేశపూర్వకంగా రెప్పలు వేయడం వంటి అలవాట్లు ఉపయోగపడతాయి. సమస్య ఎక్కువకాలం కొనసాగితే వైద్యుల సూచన మేరకు ప్రత్యేక కంటి చుక్కలు లేదా ఆయిల్ గ్రంథుల పనితీరును మెరుగుపరిచే చికిత్సలు అవసరం అవుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారు ఈ చిట్కాలను పాటిస్తే ఎంతో ఉపశమనం పొందవచ్చు

యాసిడ్ రిఫ్లక్స్ ప్రస్తుతం చాలా మందిని ఇబ్బంది పెడుతున్న సాధారణ జీర్ణ సంబంధిత సమస్య. కడుపులోని ఆమ్లం అన్నవాహికలోకి పైకి రావడం వల్ల ఛాతీలో మంట, గొంతు వరకు మంటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది ప్రాణాపాయం కలిగించే వ్యాధి కాకపోయినా, తరచూ వస్తే రోజువారీ జీవన నాణ్యతపై ప్రభావం చూపుతుంది. మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, కొన్ని సాధారణ జీవనశైలి మార్పులతో కూడా ఈ సమస్యను చాలావరకు నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడేవారు ఎడమవైపు తిరిగి పడుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా పడుకోవడం వల్ల కడుపులోని ఆమ్లం త్వరగా కిందకు వెళ్లేందుకు సహాయపడటమే కాకుండా, అన్నవాహికలో ఆమ్లం ఉండే సమయం కూడా తగ్గుతుంది. దీంతో రాత్రివేళల్లో మంట సమస్య కొంత వరకు తగ్గే అవకాశం ఉంటుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవద్దు..రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకోవడం యాసిడ్ రిఫ్లక్స్‌ను మరింత పెంచుతుంది. అందుకే నిద్రపోయే సమయానికి కనీసం రెండు నుంచి మూడు గంటల ముందే భోజనం పూర్తి చేయాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఆహారం జీర్ణం కావడానికి సమయం లభిస్తుంది. దీంతో రాత్రివేళల్లో కడుపులోని ఆమ్లం పైకి వచ్చే అవకాశం తగ్గుతుంది. పడుకునేటప్పుడు తల భాగాన్ని ఆరు నుంచి ఎనిమిది అంగుళాల ఎత్తులో ఉండేలా మంచాన్ని ఏర్పాటు చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. కేవలం దిండును ఎత్తుగా పెట్టడం కంటే మంచం తల భాగాన్ని కొద్దిగా పైకి ఎత్తితే గురుత్వాకర్షణ ప్రభావంతో ఆమ్లం పైకి రాకుండా ఉండేందుకు సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల్లో దీనివల్ల



రాత్రివేళ యాసిడ్ రిఫ్లక్స్ సమస్య గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. కారం ఆహారాలే కారణం కాదు..యాసిడ్ రిఫ్లక్స్‌కు కేవలం కారంగా ఉండే ఆహారాలే కారణమనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. అయితే శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక చక్కెర కలిగిన ఆహారాలే ఈ సమస్యను ఎక్కువగా పెంచే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల అలాంటి ఆహారాల వినియోగాన్ని తగ్గించడం మంచిదని సూచిస్తున్నారు. భోజనం చేసిన తర్వాత కనీసం పది నిమిషాల పాటు నడవడం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా రాత్రి భోజనం అనంతరం కొద్దిసేపు నడవడం వల్ల కడుపులోని ఆహారం సులభంగా జీర్ణమై, యాసిడ్ రిఫ్లక్స్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. భోజనం అనంతరం పుదీనా రుచి లేని షుగర్-ఫ్రీ చూయింగ్ గమ్ నమలడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీని వల్ల లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. తరచూ మింగడం ద్వారా అన్నవాహికలోకి వచ్చిన ఆమ్లం త్వరగా కడుపులోకి వెళ్లేందుకు సహాయ పడుతుంది. అయితే పుదీనా రుచి ఉన్న గమ్‌లను మాత్రం ఉపయోగించవద్దని సూచిస్తున్నారు. ఎందుకంటే అవి కడుపు ఆమ్లం పైకి రాకుండా అడ్డుకునే కండరాన్ని సడలించే అవకాశం ఉండటంతో సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది.

# అత్యంత పేద కుటుంబం నుంచి పీహెచ్‌డీ సాధించిన బన్సుడే రాహుల్




**ఆదిలాబాద్ : జూలై 29, :** ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన యువకుడు బన్సుడే రాహుల్ డాక్టరేట్ పట్టా సాధించి గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. రాహుల్ తండ్రి బన్సుడే సిద్ధార్థ్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించిన రాహుల్ చిన్ననాటి నుంచే హాస్టల్‌లో ఉంటూ చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించాడు. 2022లో పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన రాహుల్, "తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్గాల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో విద్య మరియు మీడియా పాత్ర" అనే అంశంపై పరిశోధన పూర్తి చేశాడు. ప్రస్తుతం రాహుల్ ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు పొలిటికల్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పరిశోధనను డాక్టర్ సునీత్ కాశివ్ పర్యవేక్షణలో సిక్కిం ఆల్పైన్ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులను అధిగమించి డాక్టరేట్ సాధించిన రాహుల్‌ను గ్రామస్తులు, విద్యావేత్తలు, మేధావులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తూ, గిరిజన యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తారని అభినందించారు.

# ప్రధాన రహదారిపై భారీ రాస్తా రోకో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు



**-డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను వెంటనే పునరుద్ధరించాలి...**

**కొమరం బీమ్ ఆసిఫాబాద్: జూన్ 29, :** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలకేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన భద్రత‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కౌటాల మండల కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. కౌటాల మండలం నాయకులు ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించిన నాయకులు మాట్లాడుతూ..డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు భద్రతను తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ఆయనకు భద్రతను యధాతథంగా కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో.. మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు , డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దక్షిణాసియా సాఫ్ట్‌బేస్‌బాల్ క్రీడలకు ఎంపికైన స్నేహా మౌల్కర్‌కు మాజీ సైనికుల సన్మానం



**కుమురం భీమ్: జూన్ 29** ఈ ప్రాంతానికి గర్వకారణంగా, స్థానిక క్రీడాకారిణి స్నేహా మౌల్కర్ ప్రతిష్టాత్మకమైన దక్షిణాసియా సాఫ్ట్‌బేస్‌బాల్ క్రీడలు 2026లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యారు. ఆమె సాధించిన ఈ అద్భుతమైన విజయం జిల్లా వ్యాప్తంగా సంబరాలకు కారణమైంది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, కుమురం భీమ్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కె. శివ కుమార్, సంఘ సభ్యులతో కలిసి స్నేహాను లాంఛనంగా సన్మానించారు. ఆమె రాబోయే అంతర్జాతీయ టోర్నమెంట్‌కు ప్రోత్సాహకరంగా, సాంప్రదాయ ఉత్సవ శాలువాతో పాటు ?1,000 నగదు బహుమతిని అందజేశారు. యువతకు సంఘం ఇస్తున్న సందేశాన్ని నొక్కిచెబుతూ, సభ్యులు "మై_దాన్ చునో, గోల్ కరో!" (మైదాన్ చూడ´ండి, లక్ష్యం సాధించండి!) అనే నినాదంతో నినాదాలు చేశారు. (రంగాన్ని ఎంచుకోండి, మీ లక్ష్యాన్ని సాధించండి), యువ ప్రతిభా వంతులను క్రీడలను చేపట్టమని ప్రోత్సహించడం.

# మాజీ సైనికుల సంక్షేమ సంఘం కొత్త సభ్యులకు సన్మానం





**-మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోరాటానికి ప్రతిజ్ఞ...**

**కుమురం భీమ్: జూన్ 29** :కుమురం భీమ్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం తన 2వ త్రైమాసిక సమావేశాన్ని సోమవారం నిర్వహించింది. ఈ సంఘం కొత్తగా చేరిన సభ్యులు సుబేదార్ గోవింద్ మండల్ (రిటైర్డ్) మరియు సుబేదార్ కనై బిస్వాస్ (రిటైర్డ్)లకు లాంఛనంగా స్వాగతం పలికి, వారు గతంలో అందించిన అమూల్య మైన సేవకు వారిని సత్కరించింది. సంస్థాగత అభివృద్ధికి అతీతంగా, సమాజ అభివృద్ధికి తమ నిబద్ధతను సంఘం గట్టిగా పునరుద్ఘాటించింది. క్రీడలు మరియు క్రియాశీల భాగస్వామ్యం ద్వారా స్థానిక యువతకు సాధికారత కల్పించే ందుకు సభ్యులు ఒక కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఆందోళనను పరిష్కరిస్తూ, సంఘం "సజా నహీ, సుధార్" (శిక్ష కాదు, సంస్కరించాలి) అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. పునరావాసం, కౌన్సెలింగ్ మరియు సానుకూల అవకాశాలు కల్పించడం అనేవి సురక్షితమైన సమాజాన్ని సాధించడానికి కీలకమని నొక్కి చెప్పింది.

# మన గ్రోమోర్ లో సర్వర్ పని చేయక యూరియా కోసం రైతుల పడిగాపులు

**-అన్నదాతకు ఆరుగాలం కష్టాలే...**
**-రైతుకు సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేసినా కాంగ్రెస్ పార్టీ నాయకులు...**



**పార్వతీపురం మన్యం: జూన్ 29,** పార్వతీపురం మన్యం జిల్లాలో రైతు యూరియా కష్టాలు పాల కులకు, అధికారులకు పట్టవా...? అని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యా లయం వద్ద కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, ఓబిసి చైర్మన్ సిరిసుపల్లి సాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బంకురు ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ: రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే అధికారులకు, పాలకులకు పట్టడం లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ వచ్చినప్పటికీ వర్షాలు లేక రైతులు ఓ ప్రక్క ఇబ్బందులు పడుతుంటే, మరో ప్రక్క యూరి యా కొరత రైతులను వేధిస్తోందన్నారు. ఎకరాకు రెండు బస్తాలు యూరియా అంటూ ఒక్క బస్తే ఇస్తామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారన్నారు. మన గ్రోమోర్ వద్దకు వెళ్తే అక్కడ సర్వర్ పని చేయడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారన్నారు. ఓవైపు సీజన్ పనులు కాక, యూరియా దొరకక రైతులు పడిగాపులు కాయలేక బ్లాక్ మార్కెట్ ను ఆశ్రయించే పరిస్థితి ఉందన్నారు. 270 రూపాయలు ఉండే యూరియా బస్తా, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా 400 రూపాయలు వరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉందని రైతులు తమ వద్ద వాపోయినట్లు తెలిపారు. అదును పోతోందని రైతులంతా ఒక్కసారిగా యూరియా కోసం వెంపర్లాడటంతో అదే అదునుగా కొంతమంది డీలర్లు దోపిడీకి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. అధికారులు నిఘా పూర్తిగా కొరవడటంతో డీలర్లు, మధ్య దళారుల హవా కొనసాగుతుందన్నారు. అడుగడుగునా అన్నదాత దగాకు గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మన గ్రోమోర్ దగ్గరకు వెళితే సర్వర్ పనిచేయదు సరి కదా, ఒకవేళ పని చేస్తే అక్కడ కూడా రైతులు తమకున్న విస్తీర్ణానికి పూర్తిస్థాయిలో యూరియా అడిగితే అదనంగా రూ. 1500 విలువ చేసే గడ్డి మందు కొనాలంటూ ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. చేసేదిలేక రైతులు యూరియా దొరకకపోతే పంట నష్టపోయే ప్రమాదం ఉందంటూ ఆంధ్రప్రధారణ చెల్లించి కొనుక్కునే దుస్థితి జిల్లాలో నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రైతులు కోరినంత, పుష్కలంగా, ఎటువంటి ఆటంకాలు పెట్టకుండా రైతులకు ఈ ఖరీఫ్ లో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. గత యాడాది కూడా రైతులకు ఇలాగే యూరియా కష్టాలు వేధించాయన్న విషయాన్ని గుర్తు చేశారు. యూరియా కంపెనీలో కూ టమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరుగాలం శ్రమించి అన్నం పెట్టే అన్నదాతకు జిల్లాలో ఆరుగాలము కష్టాలు తప్పడం లేదన్నారు.

# ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**-నర్సంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి కిరణ్...**



**నర్సంపేట: 29 జూన్** నర్సంపేట మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామంలో పార్టీ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు కత్తి కిరణ్, పెండ్యాల మధు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ముద్దం రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మేకల రాజు, ప్రధాన కార్యదర్శిగా లింకాల మల్లేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కత్తి కిరణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొమురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే మల్లేష్, ఉపాధ్యక్షులు వలుగుబెల్లి రామిరెడ్డి, వాంకుడోత్ స్వామి, వల్లాల కోటి, నరిగె కొమరయ్య, రాంబాబు, శ్రీనివాస్, ఆదిరెడ్డి, తిరుపతి రెడ్డి, బాలు, సభ్యులు వాంకుడోత్ రాజు, బిక్షపతి, సాంబయ్య, రాజాలు, కర్ణాకర్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో జనబల నాయకులకు కీలక పదవులు



**సాలూరు: 29 జూన్** సాలూరులో పర్యటించనున్న మాజీ కేంద్రమంత్రి మెగాస్టార్ చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కె. పవన్ కళ్యాణ్ ల సోదరుడు కొణిదెల నాగబాబు జనసేన అధినేత, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అరకు పార్లమెంట్ పరిధి ఎమ్మెల్సీ కె.నాగబాబు సోమవారం అరకు నియోజకవర్గంలో పర్యటన చేశారు. అందులో భాగంగా జనసేన నాయకులు మాజీ కౌన్సిలర్ గుమ్మా నాగార్జున పాల్గొన్నారు.అయన మాట్లాడుతూ: ఈ రెండు మూడు రోజుల్లో సాలూరు పట్టణానికి ఎమ్మెల్సీ నాగబాబు పర్యటిస్తారని అందులో భాగంగా జనసేన పార్టీ పాత కమిటీలను రద్దుచేసి కొత్త కమిటీలను వేస్తారని తెలిపారు. అలాగే జనసేన పార్టీకి ఎన్నో సేవలు అందిస్తున్న కీలకమైన నాయకులకు పదవి బాధ్యతలు అప్పగిస్తారని స్పష్టం చేశారు. అంతేకాకుండా జనసేన పార్టీ తనకు ఏ పదవి ఇచ్చినా పార్టీకి మరింత ప్రతిష్ట పెంచే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు.

# సినీ నటుడు సుమన్ గౌడ్‌కు మోకుదెబ్బ నాయకుల ఘన సన్మానం

**-నల్లబెల్లి శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో శాలువాతో సత్కారం...**



**నల్లబెల్లి: 29 జూన్ :** ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ డైరెక్టర్, సినీ నటుడు తల్వార్ సుమన్ గౌడ్‌కు గౌడ జనహ క్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మానం నిర్వహించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర దేవాలయానికి దర్శనం కోసం వచ్చారు. ఈ నేపథ్యంలో సుమన్ గౌడ్‌ను మోకుదెబ్బ నాయకులు,నల్లబెల్లి గ్రామ గౌడ సంఘం సభ్యులు శాలువా,బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొపగాని వెంక టేష్ గౌడ్,నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోడిశాల సాధానందం గౌడ్, నల్లబెల్లి మండల అధ్యక్షుడు మేడిపల్లి రాజు గౌడ్, దుగ్గొండి మండల అధ్యక్షుడు తడుక కొమురయ్య గౌడ్, చెన్నారావుపేటకు చెందిన గోడిశాల మల్లయ్య గౌడ్, శనిగరం సర్పంచ్ ఊటుకూరి అశోక్ గౌడ్ తో పాటు పలువురు కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సాలూరులో ఫైర్ సేఫ్టీపై తీవ్ర నిర్లక్ష్యం

**-టౌన్ లో ఒకే ఒక్కపాఠశాలకు అనుమతులు...**
**-మిగతా పాఠశాలలు, ఆసుపత్రులు, ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు చెల్లుబాటు అయ్యే ఫైర్ అనుమతులు లేవని స్టేషన్ ఫైర్ అధికారి వెల్లడి**



**పార్వతీపురం మన్యం జిల్లా: జూన్ 29,** సాలూరు ఫైర్ స్టేషన్ పరిధిలో అగ్నిమాపక భద్రతా నిబంధనల అమలుపై ఆందోళన కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి.స్టేషన్ ఫైర్ అధికారిని విలేకరులు కలిసి, ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్ని ఫైర్ సేఫ్టీ తనిఖీలు నిర్వహించారు? తనిఖీ చేసిన సంస్థల వివరాలు ఏమిటి? ప్రస్తుతం చెల్లుబాటు అయ్యే ఫైర్ ఎన్‌ఓసీ కలిగిన సంస్థల జాబితా ఇవ్వాలని కోరగా, పరిధిలో కేవలం మూడు పాఠశా లలకు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫైర్ ఎన్‌ఓసీ ఉందని ఆయన తెలిపారు.అధికారి తెలిపిన వివరాల ప్రకారం, మిగిలిన పాఠశాలలు, ఆసుపత్రులు, ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర సంస్థలకు ఫైర్ ఎన్‌ఓసీ లేదని పేర్కొన్నారు. అయితే, ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించగా, తమకు నోటీసులు జారీ చేసే వరకు మాత్రమే అధికారాలు ఉన్నాయని, తదుపరి చర్యలు జిల్లా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఉంటాయని అధికారి సమాధానమిచ్చినట్లు తెలిసింది .సాలూరు లో బాధ్యతలు చేపట్టి సుమారు 2సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు పాఠశాలలపై వారు తీసుకున్న చర్యలు శున్యం.ఈ సమాధానం స్థానిక ప్రజల్లో అనేక సందేహాలకు దారితీస్తోంది. అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉన్న ప్రజా రద్దీ ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలు కాకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.గతంలో ఓ సినిమా హాలు వద్ద సార్ట్ షర్క్యూట్ అయి పలువురు ప్రాణాలు కోల్పోయారు. అదృష్టవసాత్తు ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదాలు జరగలేదు పొరపాటున జరిగితే దానికి ఎవరు బాధ్యత తీసుకున్న జరిగిన నష్టాన్ని భర్తీచెయ్యలేరు. అగ్నిమాపక శాఖ అధికారి ఇచ్చిన వివరాల ప్రకారం ఏళ్ళ నాటి నుంచి విద్యార్థుల ప్రాణాలు రక్షణ లేకుండా ప్రమాదపుటంచున ఉన్నాయా? అనే అనుమానాలు రికేత్తుతున్నాయి. అధికారుల తీరుపై పలు అనుమానాలు రేకేత్తుతున్నాయి.ఫైర్, ఎన్‌ఓసీ లేకుండా సంస్థలు ఎలా కొనసాగుతున్నాయి?తనిఖీల తర్వాత నోటీసులు ఇచ్చారా? ఇచ్చి ఉంటే ఎన్ని?నోటీసులు పట్టించుకోని సంస్థలపై తదుపరి చర్యలు ఏమిటి?జిల్లా అధికారులు ఈ అంశంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారా?అగ్నిమాపక భద్రత అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు అది ప్రజల ప్రాణ రక్షణకు సంబంధించిన అత్యంత కీలక అంశం.ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా ప్రజా సంస్థలు కొనసాగడం భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పట్టణ ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

# ముత్తంపేట అంబేద్కర్ రోడ్డువీధిలో మురుగు కాల్వల దుస్థితి..దుర్వాసనతో ప్రజల అవస్థలు...

**కొమరంబీమ్ఆసిఫాబాద్ : జూన్ 29,** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ రోడ్డువీధి, గ్రామంలో ఉన్న మురుగు కాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కాల్వల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దోమల బెడద పెరిగి, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే కాల్వలను శుభ్రం చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు..ఆర్టీఐ,(మనలక్ష్యం డిజిటల్ దినపత్రిక రిపోర్టర్ లింగయ్య )ఇట్టి విషయం పై కార్యదర్శిని సంప్రదించగా సానుకులంగా స్పందించారు. వెంటనే మురికి కాల్వలన్నియు మురికి నీళ్లు, చెత్త చెదారంతో నిండిఉన్నాయని, వాస్తవమే నని, వర్ష కాలంలో ఎలాంటి వ్యాధులు సోక కుండా ముందు జాగ్రత చర్యగా పారిశుధ్యము నిర్వహిస్తానని తెలిపారు.జీపీ కార్యాలయంలో సమాచారహక్కు రక్షణ చట్టం 2005,బోర్డు లేదని తెలుపగా బోర్డుఏర్పాటు చేస్తానని అన్నారు.





# హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్లు



ఐర్లాండ్ గడ్డపై టీమిండియాకు చరిత్రలోనే ఊహించని షాక్ తగిలింది. రెండు టీ20ల సిరీస్‌ను పసికూన ఐర్లాండ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసి భారత్‌కు ఘోర పరాజయాన్ని పరిచయం చేసింది. ఈ ఓటమితో భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఐస్‌లాండ్ క్రికెట్ అసోసియేషన్.. గంభీర్‌కు అసాధారణ ప్రతిభ ఉందంటూ, అలాంటి కోచ్ తమకు వద్దంటూ అధికారిక ఖాతాలో వేసిన సంచలన సెటైరికల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.టీ20 ఛాంపియన్‌గా ఐర్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత్‌కు.. భారీ భంగపాటు ఎదురైంది. పసికూన ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20 మ్యాచ్‌లలోనూ టీమిండియా పరాజయం పాలైంది. దీంతో చరిత్రలో తొలిసారిగా ఆ జట్టు చేతిలో సిరీస్ ఓడిపోయింది. అంతేకాకుండా మూడేళ్ల తర్వాత ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఓటమి నమోదు చేసింది. దీంతో టీమిండియాపై నెట్టింట దారుణంగా ట్రోల్స్ వస్తున్నాయి. హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితుడయ్యాక టీమిండియా.. టెస్టుల్లో ఆశించిన మేర రాణించట్లేదు. దీంతో అతడిపై ట్రోల్స్ వస్తుంటాయి. అయితే వన్డేలు, టీ20ల్లో మాత్రం సత్తాచాటుతోంది. కానీ తాజాగా ఐర్లాండ్ చేతిలో ఓటమి తర్వాత.. గంభీర్ మరోసారి ట్రోలర్స్‌కు టార్గెట్ అయ్యాడు. కానీ ఇప్పుడు ఈ జాబితాలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా చేరిపోయింది. ఇప్పటి వరకు ఐసీసీ సభ్యదేశం కూడా కాని ఐస్‌లాండ్ క్రికెట్ అసోషియేషన్ కూడా తన సోషల్ మీడియాలో గంభీర్‌ను ట్రోల్ చేసింది. "మేం (ఐస్‌లాండ్ క్రికెట్) గౌతమ్ గంభీర్‌ను మా కోచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలని అనుకోవడం లేదు. ఒకరకంగా మారు ఇలా చేయడం ఇష్టం లేదు కూడా. గంభీర్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. కానీ భారత ఆటగాళ్లను తీసుకొచ్చి.. ఐర్లాండ్‌లో ఇలాంటి ఫలితాలను అందించాలంటే అసాధారణమైన ప్రతిభ కావాలి. అది గౌతమ్ గంభీర్ వద్ద పుష్కలంగా ఉందనిపిస్తోంది" అని ఐస్‌లాండ్ క్రికెట్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మరోవైపు పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌ను టీమిండియా కోల్పోవడం పట్ల మాజీల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చిన్న జట్టు అనే ఉదాసీనతే భారత జట్టు ఓటమికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐర్లాండ్‌ను లైట్ తీసుకోవడం వల్లే.. చరిత్రలోనే అతి భయంకరమైన ఓటమి ఎదురైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బ్యాటర్ల షాట్ల ఎంపిక దారుణంగా ఉందని విమర్శలు సైతం వస్తున్నాయి. టాప్ ఆర్డర్ వైఫల్యం కూడా టీమిండియా కొంపముంచింది.

# మ్యారేజ్ పుకార్లకు కావ్య మారన్ చెక్!




ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ అయిన కావ్య మారన్ వివాహానికి సంబంధించి ఒక కీలకమైన అప్‌డేట్ బయటపడింది. ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్‌తో ఆమె వివాహంపై ఖాయమైందని తెలుస్తోంది. అయితే, కావ్య వివాహం అకస్మాత్తుగా చర్చనీయాంశంగా ఎలా మారిందనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి, అనిరుద్ధ మామ, నటుడు వైజీ మహేంద్ర, కావ్య, అనిరుద్ధల వివాహం గురించి మాట్లాడారు. కేపీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, అనిరుద్ధ వివాహం గురించిన ప్రశ్నకు వైజీ మహేంద్ర స్పందిస్తూ, "అనిరుద్ధ చాలా కూల్‌గా ఉండే అబ్బాయి. నాకు తెలిసిన సమాచారం ప్రకారం, కావ్య మారన్‌తో అతని వివాహం దాదాపు ఖరారైంది. అతను చాలా పెద్ద కుటుంబంలోకి అడుగుపెడుతున్నాడు. ఈ సందర్భంగా నేను అతనికి అభినందనలు తెలియజేయాలనుకుంటున్నాను" అని అన్నారు. కావ్య మారన్ గురించి మాట్లాడుతూ, "కావ్య సాధారణ అమ్మాయి కాదు. అంత పెద్ద ఐపీఎల్ జట్టును నిర్వహించగల సామర్థ్యం ఆమెకు ఉంది. ఆమె తన తండ్రి నుంచి వ్యాపార నైపుణ్యాలను వారసత్వంగా పొందింది. వాళ్లిద్దరూ మంచి జోడీ. వాళ్లిద్దరూ కలిసి సంగీత రంగంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలి." ఇప్పుడు, కావ్య, అనిరుధ్‌ల పెళ్లి ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందని మీరు ఆలోచిస్తున్నారా ప్రస్తుతం దీని గురించి ఎటువంటి కచ్చితమైన సమాచారం లేదు. వారిద్దరూ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. గతంలో వారిద్దరూ డేటింగ్ చేస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలపై ఇరుపక్షాల నుంచి ఎలాంటి అప్‌డేట్ లేదు. పెళ్లి గురించి కూడా ఇరుపక్షాలు ఎలాంటి ప్రకటన చేయలేదు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2025లో, వారిద్దరూ సుమారు ఒక సంవత్సరం నుంచి డేటింగ్ చేస్తున్నారని రెడ్డిట్‌లో ఒక వైరల్ పోస్ట్ పేర్కొంది.

# గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించిన టీమిండియా




మహిళల టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్‌లలో ఒకటిగా బరిలోకి దిగిన భారత జట్టుకు లీగ్ దశలోనే ఘోర పరాభవం ఎదురైంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచులో భారత్ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 170 పరుగుల భారీ స్కోరు చేసినప్పటికీ.. ఆసీస్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ (56) మెరుపులతో కంగారూలు విజయం సాధించారు. దీంతో గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. భారత్ వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో గెలిచి, తొలిసారి విశ్వకప్ గెలిచిన టీమిండియా మహిళల జట్టుకు టీ20 ప్రపంచకప్‌లో పరాభవం ఎదురైంది. ఇంగ్లాండ్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా బరిలోకి దిగిన హర్మన్ ప్రీత్ సారథ్యంలో భారత మహిళల జట్టు .. లీగ్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది. ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలై.. నాకౌట్ అవకాశాలను పోగొట్టుకుంది. ఈ టోర్నీలో గ్రూప్-1లో భారత్ ఆడుతోంది. దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం తర్వాత.. టీమిండియా సెమీస్ చేరాలంటే ఆస్ట్రేలియాతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. లార్డ్స్ వేదికగా ఈ మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన టీమిండియా మంచి స్కోరు చేసింది. కానీ దాన్ని కాపాడుకోవడంలో విఫలమై వరల్డ్‌కప్ నుంచి నిష్కమించింది. కీలక పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56 రన్స్), స్మృతి మంధాన (37 బంతుల్లో 38 పరుగులు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎలీస్ పెర్రీ 38 బంతుల్లో 56 పరుగులు చేసి.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌'గా నిలిచింది. ఇక గ్రూప్ దశలో 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 పరాజయాలతో 6 పాయింట్లకే పరిమితమైన భారత్.. గ్రూప్-ఏలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ గెలిచిన ఆస్ట్రేలియా (10 పాయింట్లు), నాలుగింట గెలిచిన దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌తో ఆస్ట్రేలియా.. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఇంగ్లాండ్ తలపడతాయి. ఇప్పటివరకు భారత మహిళల జట్టు పదిసార్లు టీ20 ప్రపంచకప్‌లో ఆడింది. ఇందులో ఐదుసార్లు లీగ్ దశలోనే నిష్క్రమించింది. 2012, 2014, 2016, 2024, 2026లలో లీగ్ దశలోనే వెనుదిరిగింది. 2009, 2010, 2018, 2023లలో సెమీఫైనల్లో ఓడిపోయింది. 2020లో మాత్రం రన్నరప్‌గా నిలిచింది.



# హెచ్ కోచ్ పదవికి హెన్రీచ్ మలాన్ రాజీనామా

టీ20 సిరీస్?లో భారత్?ను క్లీన్ స్వీప్ చేసి చరిత్రాత్మకమైన విజయం సాధించిన కొద్ది గంటల్లోనే ఐర్లాండ్ క్రికెట్ జట్టులో భారీ మార్పులు జరిగాయి. ఆ జట్టు హెచ్ కోచ్ హెన్రీచ్ మలాన్ కోచ్ పదవికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయానికి గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. ఏదేమైనా భారత్‌లాంటి బలమైన జట్టును 2-0తో క్లీన్ స్వీప్ చేసిన అనంతరం హెడ్ కోచ్ తన పదవికి రాజీనామా చేయడం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, రీసెంట్‌గా భారత్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ టూర్‌లో రెండు మ్యాచ్ టీ20 సిరీస్ ఆడింది. అయితే పసికూన ఐర్లాండ్ జట్టు తమ సొంతగడ్డపై వరల్డ్ ఛాంపియన్స్ భారత్‌ను వరుసగా రెండు టీ20 మ్యాచ్‌ల్లోనూ ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. క్రికెట్‌లో ఫార్మాట్‌లోనైనా భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. ఈ సిరీస్‌లో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 34 పరుగులు తేడాతో ఓడిపోయింది. ఇక ఆదివారం జరిగిన రెండో టీ20లో ఒక్క పరుగు స్వల్ప తేడాతో పరాజయం పాలైంది.



# ఉత్కంఠ పోరులో కెనడా రికార్డు విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026 నాకౌట్ పోరులో కెనడా చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో కెనడా 1-0 గోల్స్ తేడాతో సౌతాఫ్రికాను ఓడించి, ప్రపంచకప్‌లో మొట్టమొదటిసారిగా 'రౌండ్ ఆఫ్ 16'లోకి దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి నిమిషంలో కెనడా మిడ్‌ఫీల్డర్ స్టీఫెన్ యూస్టాకియో కొట్టిన గోల్ ఆ జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు గోల్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. తొలి అర్ధభాగంలో సౌతాఫ్రికా జట్టు అటాకింగ్ గేమ్ ఆడుతూ కెనడా డిఫెన్స్‌ను పరీక్షించింది. అయితే, ఫైనల్ పాస్‌లు సరిగ్గా అందకపోవడంతో వారు గోల్ చేసే సువర్ణ అవకాశాలను చేజార్చుకున్నారు. మరోవైపు ఫస్ట్ హాఫ్ ముగిసే సమయానికి కెనడాకు వరుసగా రెండు గోల్స్ చేసే అవకాశాలు వచ్చాయి. కానీ, సౌతాఫ్రికా గోల్‌కీపర్ రోన్వెన్ విలియమ్స్ అద్భుతంగా సేవ్ చేశాడు. రెండో అర్ధభాగంలో కెనడా ఆటపై పూర్తి నియంత్రణ సాధించింది. మ్యాచ్ 75వ నిమిషంలో కెనడా స్టార్ ప్లేయర్ అల్ఫోన్సో డేవిస్ మైదానంలోకి అడుగుపెట్టడంతో జట్టులో సరికొత్త ఉత్సాహం వచ్చింది. డేవిస్ రాకతో కెనడా అటాకింగ్ వేగవంతం చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసి ఎక్స్‌ట్రా టైమ్‌కు వెళ్తుందని అభిమానులు భావిస్తున్న తరుణంలో, 92వ నిమిషంలో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. సౌతాఫ్రికా డిఫెండర్లు బంతిని క్లియర్ చేయడంలో చేసిన చిన్న పొరపాటును యూస్టాకియో అద్భుతంగా వాడుకున్నాడు. బాక్స్ అంచున తనకు దొరికిన బౌన్సింగ్ బాల్‌ను గోల్ పోస్ట్ లెఫ్ట్ కార్నర్‌లోకి పంపాడు. సౌతాఫ్రికా కీపర్ ఎంత ప్రయత్నించినా ఆ బంతిని ఆపలేకపోయాడు. ఈ ఏకైక గోల్‌తో కెనడా విజయం ఖరారైంది. మరోవైపు, ఈ ఓటమితో దక్షిణాఫ్రికా జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ, తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే మొదటిసారి ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరుకుని గర్వంగానే వెనుదిరిగింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఫిఫా ప్రపంచకప్ 2026' సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. శనివారంతో ముగిసిన టోర్నీ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లను వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో అభిమానులు తరలివచ్చారు. కేవలం గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లకే రికార్డు స్థాయిలో 46 లక్షలకు పైగా మంది అభిమానులు స్టేడియాలకు హాజరైనట్లు అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారికంగా ప్రకటించింది. ఫుట్‌బాల్ చరిత్రలోనే ఇదివరకు ఎన్నడూ లేనంత మంది ప్రేక్షకులు ఈ లీగ్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించారని ఫిఫా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించింది. ఫిఫా ప్రపంచకప్ 2026 సాధిస్తున్న అపూర్వ విజయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఫుట్‌బాల్ చరిత్రలోనే ఈ స్థాయి ఆదరణ మునుపెన్నడూ చూడలేదని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. 'ప్రస్తుత ఫిఫా ప్రపంచకప్ గణాంకాలు చరిత్రలోని ఏ ఇతర ప్రపంచకప్ కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ టోర్నీ విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని ట్రంప్ పేర్కొన్నారు. గ్రూప్ స్టేజ్‌లోనే 4.6 మిలియన్ల మంది ప్రేక్షకులను ఆకర్షించిన ఈ మెగా టోర్నమెంట్, ఇప్పుడు నాకౌట్ దశకు చేరుకోవడంతో ఫుట్‌బాల్ అభిమానులలో ఉత్కంఠ మరింత పెరిగింది. రాబోయే రౌండ్ ఆఫ్ 16, క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హాజరు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఖాయంగా కనిపిస్తోంది. ఫిఫా ప్రపంచకప్ 2026 రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో కెనడా చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించడంపై సౌతాఫ్రికా జట్టు ప్రధాన కోచ్ హ్యూగో బ్రూస్ భావోద్వేగంగా స్పందించారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తీవ్ర నిరాశలో ఉన్నప్పుడు భవిష్యత్తుపై ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోలేనని, రాబోయే రోజుల్లో ఆలోచించుకుని తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

# ఇంగ్లాండ్ సిరీస్‌లో వైభవ్‌ను ఆడించాలి

## అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే...




ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత టాప్ ఆర్డర్ ఘోరంగా వైఫల్యం చెంది, చరిత్రలోనే తొలిసారి సిరీస్ ఓడిపోవడంతో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆడించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే స్పందించాడు. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వంద శాతం సిద్ధంగా ఉన్నాడని, అయితే సంజూ శాంసన్ వంటి సీనియర్లకు తగినంత సమయం ఇవ్వడం కోసమే అతడిని వెయిటింగ్‌లో ఉంచామని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026తో పాటు ఇటీవల జరిగిన ట్రై సిరీస్‌లోనూ అదరగొట్టిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆడించకపోవడంపై టీమిండియా మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నల వర్షం కురుస్తోంది. బ్యాటర్ల దారుణ ప్రదర్శనతో చరిత్రలోనే తొలిసారిగా ఐర్లాండ్ చేతిలో భారత్ ఓడిపోవడంతో విమర్శలు తీవ్రత మరింత ఎక్కువైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్‌ను ఆడించకపోవడంపై మాజీలు సైతం గుర్రుగా ఉన్నారు. ఇదే విషయంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మాట్లాడాడు. దీనిపై వివరణ ఇచ్చాడు. "వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అదే సమయంలో సంజూ శాంసన్ వంటి టీ20 ప్రపంచకప్ 2026 హీరో కూడా జట్టుతోపాటు ఉన్నాడు. ఐపీఎల్‌లో వీరిద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. ఆటగాళ్లకు భరోసా ఇవ్వడంతోపాటు.. తమను తాము నిరూపించుకునేందుకు జట్టులో వారికి తగినంత సమయం కల్పిస్తామనే సందేశాన్ని అందించడం చాలా ముఖ్యం. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మేం ముందుకు సాగుతాం" అని ర్యాన్ టెన్ డస్కాటే వివరించాడు. ఇదే సమయంలో వైభవ్.. ఎప్పుడు డెబ్యూ చేస్తాడనే విషయంపై కూడా మాట్లాడాడు. "మేం కూడా వైభవ్ సూర్యవంశీ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. కానీ అరంగేట్రం విషయంలో ఇతర ఆటగాళ్లకు ఎలాంటి ప్రాసెస్ ఉంటుందో. వైభవ్‌కు కూడా అదే వర్తిస్తుంది. అతడి ఆటతీరుపై మేనేజ్‌మెంట్‌కు ఎలాంటి సందేహాలు లేవు" అని టెన్ డస్కాటే పేర్కొన్నాడు. కాగా ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో టీమిండియా టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 49 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. సంజూ శాంసన్ (5), ఇషాన్ కిషన్ (1) విఫలమయ్యారు. రెండో మ్యాచ్‌లో ఓపెనర్లు సంజూ, అభిషేక్ శర్మ తాము ఎదుర్కొన్న తొలి బంతికే పెవిలియన్ చేరిపోయారు. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన ఇషాన్ కిషన్ అనవసర పరుగు కోసం వెళ్లి 12 రన్స్ చేసి రనౌట్ అయ్యాడు. దీంతో వైభవ్ సూర్యవంశీకి.. జులై 1 నుంచి ప్రారంభం కానున్న ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తప్పకుండా ఆడించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

# మెగాఫోన్ పట్టిన రామ్.. ఘనంగా పూజా కార్యక్రమాలు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన 23వ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. =ర్యాపా23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ నిర్మాత స్రవంతి రవికిశోర్ ఈ కార్యక్రమానికి హాజరై క్లాప్ కొట్టగా, రామ్ తండ్రి మురళీ పోతినేని కెమెరా స్విచ్ ఆన్ చేసి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని రామ్ సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు హీరో రామ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండడం విశేషం. సోషల్ మీడియాలో "ది లోన్ వోల్ఫ్ జర్నీ బిగిన్స్" అనే క్యాప్షన్ తో ఈ సినిమాపై ఆసక్తిని పెంచారు. దీన్నిబట్టి ఇదొక యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి.

ఈ సినిమాకు భారీ టెక్నికల్ టీమ్ పనిచేయనుండటం విశేషం. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరు కెమెరా బాధ్యతలు చేపట్టగా, స్టార్ ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా ఎ.ఎస్. ప్రకాశ్




వ్యవహరించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# 'జై భీమ్' కాంబో రిపీట్..
## కేజీఎఫ్ నిర్మాతలతో సూర్య కొత్త సినిమా



తమిళ స్టార్ హీరో సూర్య మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'జై భీమ్' తర్వాత ఆయన మరోసారి దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో జతకట్టారు. 'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్లను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం విశేషం. ఈ సినిమా ముహూర్తపు వేడుకను సోమవారం (జూన్ 29) చెన్నైలో ఘనంగా నిర్వహించారు. సూర్య, హోంబలే ఫిల్మ్స్ కాంబినేషన్‌లో ఇదే తొలి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ సినిమాలో సూర్య సరసన హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తోంది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎస్.ఆర్. కతిర్ సినిమాటోగ్రాఫర్‌గా, ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పనిచేయనున్నారు. కమర్షియల్ అంశాలతో కూడిన ఒక పవర్‌ఫుల్, గ్రిట్టి డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే రజనీకాంత్‌తో 'వెట్టైయాన్' సినిమాను తెరకెక్కించిన జ్ఞానవేల్, వెంటనే సూర్యతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్, సూర్య మూడు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని, సినిమాల ఎంపికలో ఆయన నిర్భయ వైఖరిని ప్రశంసించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే శక్తివంతమైన, అర్థవంతమైన కథలను అందించాలన్నదే తమ ఉమ్మడి లక్ష్యమని నిర్మాత విజయ్ కిరగందూర్ పేర్కొన్నారు. ఇటీవలే 'కరుప్పు' చిత్రంతో విజయం అందుకున్న సూర్య, ఈ కొత్త ప్రాజెక్టుతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించనున్నారు.

"ఇది ఆయన నిర్మించుకున్న కెరీర్. ఫ్రేమ్ ఫ్రేమ్‌కూ, సినిమా సినిమాకూ, ఫైట్ ఫైట్‌కూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారు. ఎన్నో నిజ జీవితాల బరువును మోసే పాత్రలలో జీవించారు. ఆయన కెరీర్ ప్రతీసారీ సౌకర్యాన్ని కాదని, ధైర్యాన్ని ఎంచుకుంది. మూడు దశాబ్దాలుగా తెరపై సత్యాన్ని ఆవిష్కరిస్తూ, తెర వెనుక కోట్లాది హృదయాలను గెలుచుకున్నారు.

ఈ తరం అత్యంత నిర్భయ నటుడు, ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత భారీ వేదికపైకి అడుగుపెడుతున్నారు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం మాకు దక్కింది. హోంబలే ఫిల్మ్స్ తరఫున 'ది వన్ – సూర్య'కు మేము గర్వంగా స్వాగతం పలుకుతున్నాము. సూర్య గారితో మా ఈ ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆయన నటన, మా నిర్మాణ విలువలు కలిసి ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాము. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# నెగెటివిటీని పారిపోయేలా చేయాలంటే..!

ఎటు చూసినా నెగెటివిటీ.. ఏలిన్నాటి శని వెంటాడుతుంటే ఎవరైనా ఏం చేయగలరు? అసలు కంగన అంటేనే నెగెటివిటీ స్ప్రెడ్ అయిపోతోంది. అనవసరంగా నోరు పారేసుకుంటుందని, ఎంత పెద్ద స్థాయి వ్యక్తులను అయినా ఎదురిస్తుందని... నోటి దురుసు ఎక్కువ అని రకరకాలుగా పరిచయం అవుతోంది. ఇప్పటివరకూ ఇండస్ట్రీలో చాలామందితో విరోధం పెట్టుకోవడం తనకు మైనస్ గా మారింది. సినీపరిశ్రమలోనే కాదు.. రాజకీయంగాను శత్రువులున్నారు. తాను ఏం చేస్తున్నా వ్యతిరేకత... అయితే వీటన్నిటికీ అసలైన సమాధానం ఏది? పరిస్థితుల్ని తిరిగి తనవైపు తెచ్చుకునేలా పాజిటివిటీని పెంచుకోవాలంటే ఏం సాధించాలి! ...

క్వీన్ కంగనకు ఉన్న ఏకైక ఆప్షన్ సరైన బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టడం. ఒకే ఒక్క హిట్టు అన్నిటినీ మార్చేస్తుంది. వ్యాపారవర్గాలను, ఇండస్ట్రీ సహచరులను తనవైపునకు తిప్పుకునే బలం ఇస్తుంది. ఇప్పుడు క్వీన్ సీక్వెల్ తో ఇది సాధ్యమవుతుందని కంగన నమ్ముతోంది. తాజా సమాచారం మేరకు... వరుస పరాజయాల నుంచి తనను బయట పడేసేంత సక్సెస్ ని -క్వీన్ 2- ఇస్తుందని కంగన నమ్ముతోంది. తాజా సమాచారం మేరకు -క్వీన్ 2- షూటింగ్ శరవేగంగా సాగుతోంది. జూలై మొదటి వారానికి టాకీ పార్ట్ సహా చిత్రీకరణ మొత్తం పూర్తి కానుందని సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం తగినంత సమయం కేటాయించి, ఈ సీక్వెల్‌ను 2027లో భారీ ఎత్తున విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.మొదటి భాగంలో లండన్, పారిస్ వంటి విదేశీ నగరాలలో ఒంటరిగా ప్రయాణించి తనను తాను ఆవిష్కరించుకునే అమ్మాయిగా కంగనా కనిపించారు. అయితే ఈ సీక్వెల్‌లో కథాంశం భారతదేశంలోని పలు మహా నగరాల చుట్టూ తిరగబోతోంది. విభిన్న సంస్కృతులను, సరికొత్త జీవిత అనుభవాలను క్వీన్ పాత్ర ఎలా స్వీకరించిందనే కోణంలో కథ సాగుతుంది. ఈ చిత్రంలో కంగనా, తన స్నేహితులపై ఒక ప్రత్యేకమైన -దాండియా సాంగ్- ను కూడా మేకర్స్ గ్రాండ్‌గా చిత్రీకరించారు. ప్రస్తుతం కేవలం కొన్ని సీన్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి.

బాలీవుడ్ లో అసాధారణ నట ప్రతిభ ఉన్న కంగన రనౌత్ కి ఇన్నాళ్లు కాలం కలిసి రాలేదు. వరుసగా అరడజను భారీ ఫ్లాపులు రావడం నిరాశపరిచింది. అయితే ప్రతి ఒక్కరికీ ఇలాంటి ఒక బ్యాడ్ ఫేజ్ ఉంటుంది. ప్రతిభ ఉన్నా కాలం కలిసి రాదు. ఒకసారి సరైన విజయం వరిస్తే, అదే హుషారులో వరుస పెట్టి జోష్ తో అనుకున్నది సాధించుకునే వీలుంటుంది. అలాంటి ఒక మంచి హిట్టు కోసం కంగన ఇప్పుడు తపిస్తోంది. తనపై ఉన్న నెగెటివిటీని పూర్తిగా చెరిపేయడమే ఇప్పుడున్న తక్షణ కర్తవ్యం.

# భక్తి పారవశ్యంలో రవితేజ..
## ఆకట్టుకుంటున్న 'ఇరుముడి' ఫస్ట్ సింగిల్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచి ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు'ను చిత్ర బృందం విడుదల చేసింది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో సాగే ఈ గీతం, విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో విశేషమైన స్పందనను రాబట్టుకుంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ లిరికల్ వీడియోలో రవితేజ అయ్యప్ప మాలధారణలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. పూర్తి భక్తి పారవశ్యంలో ఆయన వేసిన స్టెప్పులు, హావభావాలు పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ మొదలయ్యే ఈ గీతం, ఆద్యంతం భక్తి రసాన్ని పండిస్తూ శ్రోతలను




కట్టిపడేస్తోంది. పాటలోని విజువల్స్, రవితేజ కొత్త లుక్ చూస్తుంటే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందనే ఆసక్తి రేకెత్తుతోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం అద్భుతంగా ఉంది. భక్తి గీతానికి అవసరమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఆయన తన మార్క్ చూపించారు. గాయకుడు అనంతు తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ఇక, ఈ పాటకు సాహిత్యం అందించడంలో దర్శకుడు శివ నిర్వాణ కూడా భాగం కావడం విశేషం. రచయిత కల్యాణ్ చక్రవర్తితో కలిసి ఆయన ఈ గీతాన్ని రచించారు. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. గతంలోనే ఈ సినిమాలో రెండు అయ్యప్ప భక్తి గీతాలు ఉంటాయని జీవీ ప్రకాశ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. డివోషనల్ థ్రిల్లర్ అనే విభిన్నమైన జానర్‌లో వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు కలగలిసి ఉంటాయని సమాచారం. తొలి పాటకు వస్తున్న అనూహ్య స్పందన చూస్తుంటే, సినిమా ఆడియో కూడా పెద్ద హిట్ అవుతుందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా అయ్యప్ప భక్తుల నుంచి ఈ పాటకు ప్రత్యేక ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఈ పాట, సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచడం ఖాయం. తదుపరి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లండన్ వీధుల్లో మెగా ఫ్యాన్స్ కోలాహలం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం కొనసాగుతోంది. ఈ సినిమా భారీ విజయం సాధించిన నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఇప్పుడు లండన్‌లో విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో పాల్గొనేందుకు లండన్ వెళ్లిన రామ్ చరణ్‌కు అభిమానులు, ప్రవాసాంధ్రులు ఎయిర్‌పోర్ట్‌లో బ్రహ్మరథం పట్టారు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఈ చిత్రానికి లభించిన అద్భుత ఆదరణకు ఈ వేడుకలు అద్దం పడుతున్నాయి.స్టైలిష్ సూట్, కళ్లద్దాలతో లండన్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన చరణ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం పోటీపడ్డారు. అనంతరం లండన్‌లోని హన్స్‌లో ఉన్న ప్రసిద్ధ సినీవరల్డ్ థియేటర్‌లో జరిగిన ప్రత్యేక ఫ్యాన్ స్క్రీనింగ్‌లో ఆయన పాల్గొన్నారు. అక్కడ అభిమానులతో కలిసి సినిమా చూస్తూ సందడి చేశారు. వారి ఆనందాన్ని దగ్గరుండి పంచుకున్నారు. 'పెద్ది' చిత్రానికి యూకేలో లభించిన ఆదరణకు కృతజ్ఞత తెలిపేందుకే ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది.'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ నెల 4న విడుదలైన ఈ సినిమా, మొదట్లో మిశ్రమ స్పందన తెచ్చుకున్నా... ఆ తర్వాత మౌత్ టాక్‌తో అద్భుత విజయం సాధించింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించిన అనంతరం, ఓవర్సీస్ అభిమానుల కోసం లండన్‌లో ఈ వేడుకను ప్లాన్ చేశారు. థియేట్రికల్ రన్ ముగిశాక, త్వరలోనే ఈ చిత్రం ఓటీటీలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది.ప్రస్తుతం లండన్ వీధుల్లో, థియేటర్ వద్ద రామ్ చరణ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానుల కోలాహలం మధ్య 'పెద్ది' సక్సెస్‌ను రామ్ చరణ్ ఎంజాయ్ చేస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com